Air conditions
up to 50 % discount
Daikin lloyd voltas bluestar lg
Samsung carrier kelvinater etc.
COOLERS AVAILABLE
ADITH ELECTRONICS
9000737332, 9246150400
E-MAIL: adithvrc@yahoo.co.in

# ప్రజాప్రశ్న
తెలుగు దినపత్రిక

MAHESH KUMAR KOVURY CELL:9885824338
STOOP
TAILORS&TEXTILES
SUITING,SHIRTING&READYMADES
MEN'S WEAR&KID'S WEAR
18-3-4,
BESIDE OLD POLICE STATION,
CHATRINAKA

సంపుటి: 3 సంచిక: 127, పేజీలు - 08
శుక్రవారం, జూలై 28, 2023 వెల: 5 రూ/.
Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati

# వాగు పొంగింది.. ఊరు మునిగింది

## - ఆపరేషన్ మోరంచపల్లి

- చుట్టూ నీరు - చెట్లపైన గ్రామస్తులు
- ఉత్కంఠగా మోరంచపల్లి గ్రామస్తుల రెస్క్యూ ఆపరేషన్







**జయశంకర్ భూపాలపల్లి (ప్రశ్న న్యూస్)** భారీ వర్షాలకు తెలంగాణలో ఊళ్లు ఏర్లు ఏకమవుతున్నాయి. గ్రామాలు, పట్టణాలు నీటమునుగుతున్నాయి. చెరువులకు గండ్లు పడుతున్నాయి రోడ్లు తెగిపోతున్నాయి. చాలా గ్రామాలు జలదిగ్బంధంలో ఉన్నాయి. జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భారీ వరదలతో జయశంకర్ భూపాలపల్లి జిల్లా మోరంచపల్లికి బాహ్యప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. మోరంచవాగు

### వరదలో 1500 మంది

ఇక మోరంచపల్లిలో సుమారు 1,500 మంది నీటిలో చిక్కుకుపోయారు. భారీ వర్షాలకు తెల్లవారేసరికి మోరంచపల్లి వాగు ఉప్పొంగడంతో నీరు ఊళ్లోకి చేరింది. ఉదయం నిద్రలేచేసరికి నీరు చుట్టు ముట్టడంతో తాము ప్రాణాలతో బయటపడతామా లేదా అని టెన్షన్ పడుతున్నారు. చాలా మంది భవనాలపైకి ఎక్కి సాయం కావాలని వేడుకుంటున్నారు. వృద్ధులు, వికలాంగులు బిక్కుబిక్కుమంటూ ఉన్నారు. నీటితో ఊరు మొత్తం మునిగిపోయింది.

### సీఎం సమీక్ష

రాష్ట్రంతో అత్యంత దయనీయ పరిస్థితిలో మోరంచపల్లి

6లో

# అధికారం కోసం వాళ్లు మణిపూర్‌నే కాదు.. దేశం మొత్తాన్నీ తగులబెడతారు

## - బీజేపీ-ఆర్ఎస్ఎస్‌లపై రాహుల్ గాంధీ ఫైర్



6లో

# జమిలికి నో ఛాన్స్

- ప్రస్తుత పరిస్థితుల్లో దేశమంతా ఒకేసారి ఎన్నికలు సాధ్యం కాదని స్పష్టీకరణ
- ఒకేసారి ఎన్నికల వల్ల అనేక లాభాలున్నాయని వెల్లడి
- అన్ని రాజకీయ పార్టీలు, అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ఏకాభిప్రాయానికి రావాల్సి ఉందని వెల్లడి



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) గత కొన్ని సంవత్సరాలుగా భారత్ లో ఎక్కువగా నానిన అంశం ఏదైనా ఉందా? అంటే అది జమిలి

6లో

## ప్రాజెక్టుల నిర్మాణంలో

# కోస్తాకు ద్రోహం

## - ఖర్చుపై చంద్రబాబు పవర్ పాయింట్ ప్రజెంటేషన్



**అమరావతి (ప్రశ్న న్యూస్)** సాగునీటి ప్రాజెక్టుల విషయంలో వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వ వైఖరిని వెల్లడించేందుకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్లు ఇస్తున్న చంద్రబాబు గురువారం కోస్తాంధ్ర ప్రాజెక్టుల గురించి వివరించారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి రూ. 780 కోట్లు కేటాయించి రూ. ఐదు కోట్లు మాత్రమే ఖర్చు పెడతారా అని చంద్రబాబు మండిపడ్డారు. తన సొంత కేసుల్లో గెలుస్తున్న ముఖ్యమంత్రి ప్రాజెక్టుల కేసుల్లో మాత్రం ఓడిపోతున్నారని ఎద్దేవా చేశారు. పులిచింతల గేట్లు కొట్టుకుపోతే కనీసం రిపేర్లు చేయించలేదన్నారు.

6లో

## కర్నాటక ఫార్ములా

# పక్క రాష్ట్రాలలో ఫలించేనా.?



- ఇటీవల పెరిగిన చేరికలతో కాంగ్రెస్ లో నూతన ఉత్సాహం
- కర్ణాటక గెలుపుకు కారణం ఉచిత హామీలేనా.?
- కర్ణాటక హామీలను మధ్యప్రదేశ్ లో అమలుకు కమలనాథ్ రంగం సిద్ధం
- అవే హామీలను తెలంగాణలో అమలు చేసేందుకు కసరత్తు

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో అందిన విజయాన్ని కాంగ్రెస్ మర్చిపోలేక పోతోంది . ముఖ్యంగా అక్కడ కాంగ్రెస్ గెలవడానికి కారణం ఎన్నికల హామీలేనని ప్రధానంగా నమ్ముతోంది. అయితే మిగతా రాష్ట్రాల్లో జరగబోయే ఎన్నికల్లోను, కర్ణాటక ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఆయా రాష్ట్రాల్లో ఇస్తే ఫలితం తమకు అనుకూలంగా ఉంటుందని బలంగా నమ్ముతోంది. అందుకే త్వరలో జరగబోయే మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచేందుకు భారీగా హామీలను ఇచ్చి విజయాన్ని

6లో

# వరదముంపులో మూడు గ్రామాలు

## - కన్నీరు పెట్టుకున్న ఎమ్మెల్యే సీతక్క

- ములుగు జిల్లా వరద ప్రభావిత ప్రాంతాల్లో సీతక్క పర్యటన
- కొండాయి గ్రామంలో వరదల్లో చిక్కుకున్న గ్రామస్థులు
- హెలికాప్టర్ ఏర్పాటు చేయాలని కన్నీరు పెట్టుకున్న సీతక్క



6లో

# ఇంద్రకరణ్ రెడ్డికి నిరసన సెగ

## - సౌకర్యాలు, ముంపుపై కడెం వాసుల ఆగ్రహం



**నిర్మల్ (ప్రశ్న న్యూస్)** భారీగా కురుస్తున్న వర్షాలకు కడెం ప్రాజెక్టు స్థాయికి మించి ప్రవహిస్తోంది. ఈ ప్రాజెక్టుకు 18 గేట్లు ఉన్నప్పటికీ నాలుగు గేట్లు పని చేయడం లేదు. దీంతో 14 గేట్లు మాత్రమే ఎత్తి దిగువకు నీటిని విడిచిపెడుతున్నారు. ఎగువ నుంచి భారీగా వరద నీరు రావడంతో గేట్ల పైభాగం నుంచి వరద నీరు ప్రవహిస్తోంది. అప్రమత్తమైన అధికారులు కడెం వాసులను ఖాళీ చేయించారు. నిర్మల్ జిల్లాలోని కడెం ప్రాజెక్టు ను గురువారం ఉదయం ఖానాపూర్ ఎమ్మెల్యే అజ్మీర రేఖా నాయక్, నిర్మల్ జిల్లా కలెక్టర్ కే వరుణ్ రెడ్డి నిర్మల్ జిల్లా ఎస్పీ ప్రవీణ్ కుమార్ తో కలిసి రాష్ట్ర న్యాయ ఆటవి దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా కడెం ప్రాజెక్టు నీటిమట్టం ప్రస్తుతం కడెం జలాశయంలో వస్తున్న ఇన్ ఫ్లో వరద నీరు వరద గేట్ల పరిస్థితి పై నీటిపారుదల శాఖ అధికారులకు అడిగి తెలుసుకున్నారు. కడెం ప్రాజెక్టు గేట్ల పై నుంచి ప్రవహిస్తున్న వరద నీరు కారణంగా లోతట్టు గ్రామాల ప్రజలను ఇతర ప్రాంతాలకు తరలించాలన్నారు. ప్రాజెక్టుకు వరద ముప్పు ఏర్పడితే తీసుకోవాల్సిన చర్యలపై పలు శాఖల అధికారులతో

6లో

# క్విట్ 'ఇండియా'

## - విపక్ష కూటమిపై ప్రధాని మోదీ ఫైర్

- రాజస్థాన్ లోని సికార్ లో బహిరంగ సభ
- హాజరైన ప్రధాని మోదీ
- యూపీఏ హయాంలో ఘనకార్యాలు చేశారంటూ విమర్శలు
- వాటిని కప్పిపుచ్చుకోవడానికే కూటమి అంటూ వ్యాఖ్యలు
- అహంకారంతో ఉన్నారంటూ ఆగ్రహం



జైపూర్ (ప్రశ్న న్యూస్) నేషనల్ డెవలప్ మెంట్ ఇంక్లుజివ్ అలయన్స్ 'ఇండియా' పేరిట తమకు వ్యతిరేకంగా కూటమి కట్టిన విపక్షాలపై ప్రధాని నరేంద్ర మోదీ మరోసారి విరుచుకుపడ్డారు. నాడు మహాత్మా గాంధీ క్విట్ ఇండియా నినాదం చేశారని, ఇప్పుడు అవినీతి, రాజకీయాలను దేశం నుంచి పారదోలేందుకు క్విట్ ఇండియా అనాల్సి వస్తోందని విమర్శించారు. రాజస్థాన్ లోని సికార్ లో ఏర్పాటు చేసిన ఓ భారీ సభలో మోదీ ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'ఇండియా' అనే ముద్ర

6లో

## హైదరాబాద్-విజయవాడ

# హైవే బంద్

## - కొత్త రూట్ చెప్పిన పోలీసులు



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) :** హైదరాబాద్ నుండి విశాఖపట్నం వయా విజయవాడ మీదుగా ప్రయాణించే వాహనదారులకు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ కీలక సూచనలు చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గత ఐదు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు కారణంగా హైదరాబాద్ విజయవాడ నగరాల మధ్య కీసర గ్రామం వద్ద (నందిగామ మండలం, ఎన్.టి.ఆర్.జిల్లా) ఎన్ హెచ్ 65 హైవే పై మున్నేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నందని తెలిపారు. అందువల్ల వాహనాల రాకపోకలకు వీలు లేదని, అందువల్ల హైదరాబాద్ విజయవాడ, విజయవాడ హైదరాబాద్ ల మధ్య ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా ప్రయాణికుల క్షేమం కోరి వాహనాలను అనుమతించడం లేదని గురువారం (జూలై 27) రాత్రి ఓ ప్రకటనలో ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ వెల్లడించారు. కాబట్టి, ఈ విషయాన్ని గమనించి హైదరాబాద్ నుండి విశాఖపట్నానికి వయా విజయవాడ మీదుగా అదేవిధంగా విశాఖపట్నం నుండి హైదరాబాద్ ప్రయాణించే

6లో

# మన విద్యార్థులను మనమే సపోర్ట్ చేయాలి

**- జగనన్న విదేశీ విద్యాదీవెన నిధులు విడుదల**

**- మొత్తం రూ.45.53 కోట్లు జమ**




అమరావతి (ప్రశ్న న్యూస్) జగనన్న విదేశీ విద్యాదీవెన రెండో విడత నిధులను ఏపీ సీఎం జగన్ విడుదల చేశారు. అర్హులైన 357 మంది లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా రూ.45.53 కోట్లను బటన్ నొక్కి మరీ జమ చేశారు. గడచిన ఆరు నెలల్లో జగనన్న విదేశీ విద్యాదీవెన కింద మొత్తంగా రూ. 65.48 కోట్లు విడుదల అయ్యాయి. దేవుడి దయతో నేడు రాష్ట్రంలో మరో మంచి కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నామని సీఎం జగన్ తెలిపారు. మంచి కాలేజీల్లో సీట్లు వచ్చిన వారికి, డబ్బు కట్టలేని పరిస్థితుల్లో ఉన్న రాష్ట్ర విద్యార్థులకు విదేశాల్లో చదువుల జగనన్న విదేశీ విద్యా దీవెన పథకాన్ని తీసుకొచ్చామని చెప్పుకొచ్చారు. ఆ పథకం రాష్ట్ర విద్యార్థులకు వరంలా మారిందని అన్నారు. మొత్తంగా 357 మంది పిల్లలకు రూ. 45.53కోట్లు జమ చేస్తున్నామన్నారు. నేరుగా విద్యార్థుల తల్లుల ఖాతాల్లోనే డబ్బులు జమ చేస్తున్నామని పేర్కొన్నారు. అత్యంత పారదర్శకంగా ఈ పథకాన్ని అమలు చేస్తున్నామని, అవినీతికి, వివక్షకు తావులేకుండా చూస్తున్నామని స్పష్టం చేశారు. ప్రపంచంలోనే అత్యుత్తమంగా నిలిచిన కాలేజీల్లో ఎవరికి సీటు వచ్చినా వారికి పథకాన్ని అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి జగన్ వెల్లడించారు. క్యూస్, టైమ్స్ ర్యాంకింగ్స్‌లోని 21 కోర్సుల్లో ఉన్న టాప్ 350 కాలేజీల్లో సీటు వస్తే డబ్బులు అందజేస్తున్నట్లు వివరించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రూ.1.25 కోట్లు వరకూ మిగిలిన వారికి కోటి రూపాయల వరకూ చెల్లిస్తున్నామని చెప్పుకొచ్చారు. విమాన ఛార్జీలు, వీసా ఛార్జీలు కూడా చెల్లిస్తున్నామని పేర్కొన్నారు. టాప్ కాలేజీల్లో సీటు వచ్చి ఫీజులు చెల్లించలేని సామాన్య, మధ్యతరగతి పిల్లలకు సర్కారే ఫీజు చెల్లిస్తే ఎలా ఉంటుందనే ఆలోచనతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు వెల్లడించారు. ఇలాంటి కాలేజీలలో చదివి రాష్ట్ర విద్యార్థులు బయటకు వస్తే.. ప్రపంచంలోని అనేక టాప్ కంపెనీలను శాసించే స్థాయికి చేరుతారని వివరించారు. విద్యార్థులు అంతా పెద్ద స్థాయిలోకి వెళ్లే అవకాశం వస్తుందన్నారు. ఇలాంటి కాలేజీల్లో సీట్లు వచ్చే మన పిల్లలకు మనం చేయూతనివ్వాలనే ఉద్దేశంతోనే జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం తీసుకొచ్చినట్లు స్పష్టం చేశారు.

గతంలో కేవలం రూ.10 లక్షలు మాత్రమే ఇచ్చేవారని.. ఎస్సీ, ఎస్టీ వాళ్లకు రూ.15 లక్షలు మాత్రమే చెల్లించే వారని గుర్తు చేశారు. కానీ ప్రస్తుతం మాత్రం ఏకంగా 1.25కోట్లు ఇస్తున్నట్లు వివరించారు. గతంలో సిఫార్సులు ఉంటేనే ఇచ్చేవారని.. అదికూడా అరకొరకే అని విమర్శించారు. ఇవాళ ఆ స్కీంలో పూర్తిగా మార్పులు తీసుకు వచ్చామని.. శాచ్యురేషన్ పద్ధతిలో అమలు చేస్తున్నామని సీఎం జగన్ పేర్కొన్నారు. టాప్ 320 కాలేజీలకు వర్తింపు చేస్తున్నామన్నారు. విద్యారంగంలో ఇది విప్లవాత్మక మార్పు అని చెప్పారు. ఇలా విద్యార్థులకు బాసటగా నిలుస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్ర ప్రదేశ్ మాత్రమేనన్నారు. ఈ కాలేజీల్లో చదువుతున్న పిల్లలు పెద్ద పెద్ద స్థాయిల్లో రాణించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. నాలుగు వాయిదాల్లో ఈ స్కాలర్ షిప్ ఇస్తున్నామని ఇమ్మిగ్రేషన్ అనుమతి రాగానే ఒక వాయిదా, మొదటి సెమిస్టర్ పూర్తికాగానే రెండో వాయిదా, రెండో సెమిస్టర్ రాగానే మూడో వాయిదా, 4వ సెమిస్టర్ పూర్తయ్యాక నాలుగో వాయిదా ఇస్తున్నామని వివరించారు.

## రానున్న 24 గంటలు అప్రమత్తంగా ఉండాలి.

## జిల్లా కలెక్టర్ రాజర్షి షా .



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్) గురువారం ఊసలపల్లి వద్ద రామయంపేట్ మెదక్ రహదారి హై వే రోడ్డు పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. వర్షాలకు రహదారి కి అంతరాయం కలగడం తో పైప్లైన్ పనులు యుద్ధ ప్రాతిపదికన జరగాలని అధికారులు ఆదేశించారు.మెదక్ మండలం నాయక్ చెరువు వరద ఉధృతిని పరిశీలించారు చెరువుకట్టు తెగే అవకాశం ఉందని అధికారులు అప్రమత్తం గా వుండి తగు చర్యలు తీసుకోవాలన్నారు.జిల్లాలో మరో 24 గంటలు అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జిల్లా అధికారులు క్షేత్రస్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు . వర్షాలకు రోడ్లు చెరువులు కుంటలకు వరద వచ్చే ప్రమాదం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ప్రజల సౌకర్యం కొరకు కలెక్టరేట్ లో కంట్రోల్ రూమ్ ,ఫోన్ నెం 9391942254 ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు విద్యుత్ శాఖ కార్యాలయంలోనూ కరెంటు సమస్యలకు కంట్రోల్ రూమ్ ,7901677782 ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ శ్రీనివాసరావు. మెదక్ మున్సిపల్ కమిషనర్ జానకి రామ్ సాగర్, ఎంఆర్ఓ శ్రీనివాస్, సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండండి

## మెదక్ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ )భారీ వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి అన్నారు. మరో రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని , ప్రజలు అత్యవసర పరిస్థితిలోనే బయటకు రావాలని కోరారు. ప్రజలు కూలెందుకు సిద్ధంగా ఉన్న కరెంటు స్తంభాలు, చెట్లు, కాలువల మ్యానువల్ వద్దకు వెళ్ళవద్దని సూచించారు. పాత ఇండ్లలో నివసించవద్దని విజ్ఞప్తి చేశారు. అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండి ప్రజలకు తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించినట్లు వివరించారు. గురువారం మెదక్ పట్టణంలోని సాయి నగర్,బృందావన్ కాలనీలో ఎం ఎన్ కెనాల్ నీటి నీటి ప్రవాహం ద్వారా వర్షాకాలంలో వచ్చే సమస్యను గుర్తించమని చెప్పారు. ఈ సమస్యలను శాశ్వత పరిష్కారం దిశగా పనులు చేపడతామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కెసిఆర్, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ఇటీవల మెదక్ అభివృద్ధికి రూ.20 కోట్లు మంజూరు చేశారని ఆ నిధులతో ముందుగా ప్రధాన సమస్యలను గుర్తించి పనులు చేపడతామని చెప్పారు.

## గోపాల్ పూర్ మానరు వద్ద గల్లంతైన వ్యక్తి సురక్షితం

**సంఘటన స్థలాన్ని పరివేక్షించిన జిల్లా కలెక్టర్, జెడ్పీ చైర్మన్**



మంథని (ప్రశ్న న్యూస్ ) గోపాల్‌పూర్ మానేరు వాగులో ఇసుక క్వారీ కి సంబంధించిన సిబ్బంది గల్లంతయ్యారు. సమాచారం అందుకున్న వెంటనే జడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్ జిల్లా కలెక్టర్ సంఘటన స్థలానికి చేరుకొని పర్యవేక్షించారు. చిక్కుకున్న బాధితులను సురక్షితంగా బయటకు తీసుకు రావడానికి స్వయంగా పరిస్థితిని సమీక్షిస్తు కలెక్టర్‌తో పాటు సీఎం కేసీఆర్ దృష్టికి పరిస్థితిని వివరించి సహాయక చర్యల కోసం ముమ్మర ప్రయత్నాలు చేశారు. జడ్పీ చైర్మన్ పుట్ట మధు చేపట్టిన సహాయక చర్యలు ఫలించి గల్లంతైన వ్యక్తి సురక్షితంగా తిరిగి వచ్చాడు దేంతో అధికారులు వారి సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. జడ్పీ చైర్మన్ చేపట్టిన సహాయక చర్యలను ప్రజలు అభినందించారు.

## గోపాల్ పూర్ ఇసుక క్వారీ వద్ద వరద ఉధృతిలో చిక్కుకున్న సిబ్బంది

**వెంటనే కాపాడాలని కలెక్టర్ ను,**

**ఎమ్మార్వో ను అప్రమత్తం చేసిన ఎమ్మెల్యే శ్రీధర్ బాబు**



మంథని( ప్రశ్న న్యూస్ ) గోదావరి ఉధృతి పెరిగే అవకాశం ఉన్నందున పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంథని ఎమ్మెల్యే శ్రీధర్ బాబు విజ్ఞప్తి చేశారు. గోదావరి ప్రాంత ప్రజలను మానేరు ప్రాంత ప్రజలను సురక్షిత పునరావాస కేంద్రాలకు తరలించాలని ఎమ్మార్వోలను కోరారు. మంథని మాతా శిశు ఆసుపత్రిలోకి వరద వచ్చే అవకాశం ఉన్నందున పేషెంట్లను పెద్దపల్లి మాత శిశు ఆసుపత్రికి షిఫ్ట్ చేయాలని పెద్దపల్లి డి సి హెచ్ ఎస్, మంథని సూపర్డెంట్ తెలిపి షిఫ్ట్ చేయించారు. మంథని మండలం గోపాల్ పూర్ గ్రామంలోని ఇసుక క్వారీ వద్ద క్వారీ సంబంధించిన సిబ్బంది మానేరు ఉధృతంగా ప్రవహించడం వల్ల చిక్కుకోవడం జరిగింది. ఈ విషయాన్ని వెంటనే జిల్లా కలెక్టర్ పెద్దపల్లి సంబంధిత తాహాశీల్ దార్ లకు తెలియజేసి అక్కడికి పంపించడం జరిగింది. ప్రస్తుతం వాళ్లను కాపాడే విధంగా సహాయ చర్యలు జరుగుతున్నాయని అధికారులు తెలిపారు.మల్హార్ రావు,మల్లారం, చిన్న ఓదాల,గోపాల్ పూర్ తదితర గ్రామాలు మానేరు పరివాహ ప్రాంతాల,గోదావరి ఉధృతి కూడా పెరిగే అవకాశం ఉన్నందున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని వెంటనే ఆ ముంపు ప్రాంత ప్రజలను సురక్షితంగా పునరావాస కేంద్రాలకు తహసిల్దార్ తరలించాలని ఎమ్మెల్యే తహసిల్దార్ లను లను కోరారు. మంథని మాతా శిశు ఆసుపత్రిలో గత సంవత్సరంలో వరద వల్ల ఆసుపత్రి లోపల వాటర్ చేరడం జరిగినందున ప్రస్తుతం వరద నీరు మాతా శిశు దగ్గర చుట్టు ముట్టి ఉన్నందున పెద్దపల్లి డి సి హెచ్ ఎస్,మంథని సూపర్డెంట్ ను అప్రమత్తం చేసి మంథని మాతా శిశు కేంద్రంలోని పేషెంట్లను పెద్దపెల్లి మాతా శిశు కేంద్రంలోకి తరలించడం జరిగింది.

## వరద బాధితులకు అండగా పుట్ట దంపతులు



మంథని (ప్రశ్న న్యూస్ ) కుండపోత వర్షాలతో వరదల్లో చిక్కుకున్న బాధితులకు పుట్ట మధూకర్-శైలజ దంపతులు అండగా నిలుస్తున్నారు. మంథని మాతా శిశు ఆసుపత్రిలో వరద నీరు చేరే ప్రమాదం ఉన్నందున అక్కడున్న పేషంట్లను స్వయంగా మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ ప్రధాన ఆసుపత్రికి తరలిస్తున్నారు. గోపాల్‌పూర్ మానేరు వాగులో చిక్కుకున్న సుమారు 12 మంది బాధితులను రక్షించడానికి అధికారులను ఆదేశించిన జిల్లాపరిషత్ చైర్మన్ పుట్ట మధూకర్ స్వయంగా రక్షణ చర్యలు పర్యవేక్షిస్తూ మానేరు వాగులో చిక్కుకున్న వారిని కాపాడడానికి జిల్లా అధికారులను, సిబ్బందిని రంగంలోకి దింపారు. పరిస్థితిపై ఎప్పటికప్పుడు సీఎంవోకు సమాచారం ఇవ్వడంతో పాటు వారి రక్షణకు అవసరమైన బోట్లను,గజ ఈతగాళ్లను రప్పించడానికి త్వరితగతిన ఏర్పాట్లు చేస్తున్నారు. వాగులో చిక్కుకున్న వారికి ధైర్యం కల్పిస్తూ అవసరమైతే హెలికాప్టర్లను తెప్పిస్తామని ఎవరూ తొందరపడి వాగు దాటే ప్రయత్నాలు చేయకుండా అధికారులు చేపట్టే చర్యలకు సహకరించాలని కోరారు. ముంపు ప్రాంతాల్లో ఉన్న ప్రజలు జాగ్రత్తలు పాటించాలని కోరారు. ముంపు ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు వరద బాధితులకు సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

## పలు ప్రాంతాలను పరిశీలించిన మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్





హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) భారీ వర్షాల నేపథ్యంలో హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో పురపాలక శాఖ మంత్రి కేటీఆర్, జిహెచ్ఎంసి కమిషనర్ రోనాల్డ్ రోస్ పర్యటించారు. హుస్సేన్ సాగర్ వద్ద వరద ఉధృతిని మంత్రి పరిశీలించారు. అనంతరం చాదర్ ఘాట్ మూసీ నది లో-లెవెల్ వంతెన వద్ద వరదను పరిశీలించారు. రాష్ట్రవ్యాప్తంగా వర్ష ప్రభావిత పట్టణాల్లో ఉన్న పరిస్థితులపైన పురపాలక శాఖ అధికారులు, అడిషనల్ కలెక్టర్లతో మంత్రి కేటీఆర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రాణ నష్టం జరగకుండా చూడడమే ప్రాథమిక ప్రాధాన్యతగా పని చేయాలని, లోతట్టు ప్రాంతాల్లో ఉన్న పరిస్థితులపైన అప్రమత్తంగా ఉండాలని మంత్రి కేటీఆర్ ఆదేశించారు.సమీక్షా సమావేశం అనంతరం మంత్రి కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల వల్ల నెలకొన్న పరిస్థితులను ముఖ్యమంత్రి కేసీఆర్ ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. పురపాలక శాఖ అధికారులతోనూ కూడా ముఖ్యమంత్రి ప్రత్యేకంగా మాట్లాడారు. వరద నీరు నిలిచిన పట్టణాల్లో మరిన్ని సహాయక చర్యలు చేపడతాం. హైదరాబాద్ నగరంలోనూ జిహెచ్ఎంసి కమిషనర్ రోనాల్డ్ రోస్ ఇతర ఉన్నతాధికారులు, క్షేత్రస్థాయిలో ఉన్న కిందిస్థాయి సిబ్బంది వరకు అందరూ పనిచేస్తున్నారు. పురపాలక ఉద్యోగుల అన్ని సెలవులను రద్దు చేయడం జరిగింది. పరిస్థితిని ఎప్పటికప్పుడు ఫోన్ల ద్వారా, ఇతర మాధ్యమాల ద్వారా సమీక్షిస్తున్నాం. వరంగల్ నగరానికి వెళ్లాలని మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులను ఆదేశించాము. అవసరాన్ని బట్టి రేపు నేను కూడా స్వయంగా వెళ్తాను అన్నారు.

## భారీ వర్షంతో జనం అతలాకుతలం..!!

**ప్రజల మధ్యలో కాంగ్రెస్ నేత మ్యాడం బాలక్రిష్ణ**

**పట్టణంలోని పలు కాలనీల్లో పర్యటన**



మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్ )మెదక్ గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో జనజీవనం అతలాకుతలమైంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ వైపరిత్యంతోకొట్టుమిట్టాడుతున్న జనానికి కాంగ్రెస్ పార్టీ ఆసరాగా నిలిచింది. రాష్ట్ర కాంగ్రెస్ అధికార ప్రతినిధి మ్యాడం బాలక్రిష్ణ అధ్వర్యంలో కాంగ్రెస్ నేతలు జోరు వానలోనూ మెదక్ పట్టణంలో కలియ తిరిగారు. పట్టణంలోని మిలిటరీ కాలనీల్లో పర్యటించి జనం సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మిలిటరీ కాలనీలో సర్వర్ అనే ఆటో డ్రైవర్ ఇల్లు కూలింది. కుటుంబ సభ్యులు నిరాశ్రయులయ్యారు. ఈ సందర్భంగా ఆ కుటుంబాన్ని పరామర్శించిన కాంగ్రెస్ నేతలు ఆర్థిక సాయం కూడా చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మెదక్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ హఫీజ్, కాంగ్రెస్ నేతలు నాగిరెడ్డి, సల్మాన్, సంజీవ్, జాకీర్, ప్రభాకర్, జకారియ తదితరులు ఉన్నారు.

## మంథని మాతా శిశు ఆసుపత్రి కేంద్రంలో ఉన్న పేషెంట్లను పెద్దపల్లికి తరలింపు

**మెడికల్ సూపరిండెంట్ శ్రీనివాస్ రెడ్డి**



మంథని( ప్రశ్న న్యూస్ ) వర్షాలు,వరద తీవ్రత కారణంగా పై అదికారుల సూచన మేరకు మాతా శిశు కేంద్రం లో ఉన్నటువంటి పేషంటులను పెద్దపల్లి మాతా శిశు కేంద్రంనకు తరలించడం జరిగింది. అత్యవసర మైన ప్రసూతి,గర్భిణి స్త్రీ సేవల కొరకు సివిల్ ఆసుపత్రి (సి హెచ్ సి మంథని లక్ష్మీ నారాయణ స్వామి గుడి దగ్గర) ఆసుపత్రిలో వైద్య సేవలు యథావిధిగా అందిచబడుతాయని మంథని మెడికల్ సూపరింటెండెంట్ ఎం సి హెచ్ సి హెచ్, సి తెలియజేశారు.

## వరద బాధితులను పునరావాస కేంద్రానికి తరలించిన అధికారులు



మంథని( ప్రశ్న న్యూస్ ) మంథని మండలం నాగ పల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన మూడు కుటుంబాలు వరదనీటిలో తిక్కుకోగా వారిని కేంద్రానికి తరలించామని మంథని ఎంపీడీవో రమేష్ తెలిపారు. నాగ పెల్లి ఎస్సీ కాలనీకి చెందిన తోటపల్లి కిష్టయ్య తోటపల్లి రాజయ్య తోటపల్లి లచ్చయ్య కుటుంబాలను నాకే పెల్లి గ్రామ పంచాయతీ ఆఫీస్ కు తరలించామని తెలిపారు. అలాగే ఈదురు గాలులకు విరిగిపడ్డ చెట్లను గ్రామపంచాయతీ సిబ్బంది చేత తొలగించడం జరిగిందని అన్నారు.

## అధైర్య పడవద్దు అండగా ఉంటాం

**మున్సిపల్ చైర్ పర్సన్ పుట్ట శైలజ.**



మంథని (ప్రశ్న న్యూస్ ) భారీ వర్షాల వల్ల లోతట్టు ప్రాంతమైన లైన్ గడ్డ ప్రాంత ప్రజలను మున్సిపల్ చైర్పర్సన్ పుట్ట శైలజ లైన్ గడ్డ పరిసరాలను పరిశీలించి ప్రజలను ప్రజలను అప్రమత్తం చేశారు. లైన్ గడ్డ లో 150 మంది జనాభా ఉండగా 100 మంది ఓటర్లు ఉన్నారు. 45 ఇల్లు ఉండగా 65 కుటుంబాలకు చెందినవారు ఇక్కడ నివాసముంటున్నారు. ఆమె వెంట వైస్ చైర్మన్ ఆరెపల్లి కుమార్ వార్డు కౌన్సిలర్ శ్రీ వీకే రవి, కొట్టే పద్మ - రమేష్, కుర్ర లింగయ్య ఉన్నారు

## సంపాదకీయం

# సంస్కరణల స్వీయహననం!

ప్రజలు, ప్రతిపక్షాల నుంచి నెలల తరబడి నిరసన వ్యక్తమవుతున్నా, తాము అనుకున్నదే చేసే పాలకులు ప్రపంచమంతటా ఉంటారు. మొత్తం 93 లక్షల జనాభాలో, రెండున్నర లక్షల మందికి పైగా జనవరి నుంచి వీధికెక్కి నిరసనకు దిగుతున్నా, ఇజ్రాయెల్‌లోని బెంజమిన్ నెతన్యాహూ సర్కార్ తాను అనుకున్నదే చేసింది.

దేశ చరిత్రలోనే కనివిని ఎరుగని అత్యంత భారీ నిరసనల్ని సైతం తోసిపుచ్చి, ఇజ్రాయెలీ పార్లమెంట్ వివాదాస్పద న్యాయసంస్కరణల్లో మరో కీలక అంశానికి సోమవారం ఆమోదముద్ర వేసింది. దేశంలో అధికార సమతూకాన్ని మార్చేసే ఈ చర్య సంచలనమైంది. మంత్రులు తీసుకొనే నిర్ణయాలు 'నిర్హేతుకం' అనిపించినప్పుడు వాటిని కొట్టివేసేందుకు సుప్రీమ్ కోర్ట్‌కు ఇప్పటి దాకా అధికారముంది. సరికొత్త సోకాల్డ్ 'సహేతుకత' బిల్లుతో దానికి కత్తెర పడనుంది.

రాబోయే రోజుల్లో మరో ఓటింగ్‌లో న్యాయ నియామకాలపైనా ప్రభుత్వానికే మరిన్ని అధికారాలు కట్టబెట్టాలన్నది తదుపరి ఆలోచన. ఈ మార్పుల్ని కొందరు సమర్థిస్తున్నప్పటికీ, అత్యధికులు వ్యతిరేకిస్తున్నారు. కలిగే విపరిణామాలపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిజానికి, అధిక శాతం ఇజ్రాయెలీలు లౌకికవాద, వామపక్ష, ఉదారవాదులు. కానీ, తీవ్ర మితవాద పార్టీలతో కూడిన సంకీర్ణ ప్రభుత్వాల ఏర్పాటుతో అక్కడి ప్రభుత్వ విధానమూ మితవాదం వైపు మొగ్గుతోంది.

ఆ ప్రభుత్వాలకూ, న్యాయవ్యవస్థకూ మధ్య తరచూ ఘర్షణ తలెత్తుతోంది. దీనికి విరుగుడుగా కోర్టు కోరలు పీకేయాలనేది ఛాందస, జాతీయవాద నెతన్యాహూ సర్కార్ ప్రయత్నం. పాలకులపై ఉన్న ఏకైక అంకుశమైన కోర్ట్‌ను సైతం అలా ప్రభుత్వ నియంత్రణలోకి తెస్తే, వ్యవస్థల పరంగా ఉన్న సమతూకం దెబ్బతినడం ఖాయం. అందుకే, ఇన్ని నెలలుగా దేశంలో ఈ భారీ ప్రజాందోళనలు.

కార్యనిర్వాహక, శాసననిర్మాణ, న్యాయవ్యవస్థలు మూడింటికీ మధ్య అధికార విభజనలో అనేక అంశాలను మార్చాలని నెతన్యాహూ కొంతకాలంగా ప్రయత్నిస్తున్నారు. ఆయన సారథ్యంలోని సాంప్రదాయవాద, మతతత్త్వ సంకీర్ణ ప్రభుత్వం అందుకు కంకణం కట్టుకుంది. అవినీతి ఆరోపణలపై విచారణను ఎదుర్కొంటున్న ఆయన కోర్టు భవిష్యత్ తీర్పులు తనపై ప్రభావం చూపకుండా ఉండేందుకే ఈ పని చేస్తున్నారని విమర్శకుల మాట.

నిజానికి, ఇజ్రాయెల్‌లో రాజ్యాంగమంటూ లేదు గనక, పై మూడు వ్యవస్థల మధ్య వ్యవహారమంతా వ్యక్తిగత చట్టాలు క్రమబద్ధీకరిస్తుంటాయి. పార్లమెంట్‌లో రెండో సభ లేదు గనక అది చేసే చట్టాలకు అవసరమైతే ముకుతాడు వేసేలా సుప్రీమ్ కోర్ట్‌కే బలమైన స్థానం ఉందక్కడ! ఇలా న్యాయవ్యవస్థకు అతిగా అధికారాలున్నాయనేది ప్రభుత్వ మద్దతుదార్ల భావన. ఎంపీల్లా జడ్జీలనేమీ ప్రజలు నేరుగా ఎన్నుకోవడం లేదనీ, ఇప్పుడీ ప్రతిపాదిత సంస్కరణలతో అధికార సమతూకం మెరుగై, ప్రజాస్వామ్యం పటిష్ఠమవుతుందనీ వారి వాదన.

సంస్కరణల్ని వ్యతిరేకిస్తున్నవారు మాత్రం దీన్ని ప్రజాస్వామ్య విధ్వంసం అంటున్నారు. లింగ సమానత్వం, లైంగిక అల్పసంఖ్యాకుల రక్షణ లాంటి అంశాలను గతంలో సుప్రీం పదేపదే సమర్థించిందనీ, రేపు ఈ కొత్త సంస్కరణలతో అందుకు అవకాశం లేక సమాజం చీలిపోతుందనీ వాదిస్తున్నారు. తాజా సంస్కరణలు దేశంలో అతి సాంప్రదాయ వర్గాన్ని బలోపేతం చేస్తాయన్నది లౌకికవాదుల భయం.

ఈ అంశం సైన్యం దాకా పాకింది. ఇప్పటికే స్త్రీ పురుషులిద్దరూ సైన్యంలో తప్పనిసరిగా సేవలందించాలన్న నిబంధన నుంచి అతి సాంప్రదాయ యూదులను ప్రభుత్వం మినహాయించింది. సుప్రీం దీన్ని తప్పుబట్టి, ఇది దుర్విచక్షణ అని పదే పదే ప్రకటించింది.

ఇప్పుడీ న్యాయ సంస్కరణల్ని అమలుచేస్తే, స్వచ్ఛంద సేవ నుంచి వైదొలుగుతామంటూ వెయ్యిమందికి పైగా ఇజ్రాయెలీ ఎయిర్ ఫోర్స్ రిజర్విస్టులు హెచ్చరించారు. గూఢచర్య సంస్థలు సహా అనేక ఇతర విభాగాల్లోని వారూ తమదీ ఆ మాటే అంటున్నారు. అదే జరిగితే ఆ దేశ భద్రతకు ముప్పే!

మరోపక్క, పార్లమెంట్ ఆమోదించిన సంస్కరణ క్లాజుపై కోర్టుకెక్కనున్నట్టు పౌరసమాజ బృందాలు ప్రకటించాయి. అంటే తమ అధికారాలకు కత్తెర వేయడం సహేతుకమో, కాదో జడ్జీలే పరీక్షించాల్సి వస్తుంది. న్యాయమూర్తులు గనక ఈ సంస్కరణను అడ్డుకుంటే, ఇజ్రాయెల్ ఊహించని జాతీయ సంక్షోభంలో పడవచ్చు.

ఒకవేళ దాన్ని నివారించేందుకు ప్రభుత్వం తాజా సంస్కరణను ఉపసంహరించుకుంటే, అది చివరకు పాలక సంకీర్ణం కుప్పకూలడానికి దారి తీయవచ్చు. ఏదైనా చిక్కే! మధ్యప్రాచ్యంలో ఏకైక ఆధునిక ప్రజాస్వామ్యంగా ఇజ్రాయెల్‌కున్న పేరు ఈ మొత్తం వ్యవహారంలో దెబ్బతింటుంది. దేశ ఆర్థికవ్యవస్థ, విదేశాంగ విధానం పైనా దెబ్బ పడుతోంది.

న్యాయసంస్కరణల సంక్షోభంతో ఫిబ్రవరి నాటికే 400 కోట్ల డాలర్లు ఇజ్రాయెల్ నుంచి తరలి పోయాయట. అలాగే, దేశ శ్రామికశక్తిలో 11 శాతం మంది దాకా హైటెక్ రంగ ప్రవీణులు. వారిలో అధికశాతం సంస్కరణల్ని వ్యతిరేకిస్తూ, వీధికెక్కినవారే! ఈ సాంకేతిక ప్రతిభాశాలురు దేశం విడిచి పోవచ్చు.

అలా జరిగితే అది మరో దెబ్బ. ఇక, న్యాయ ప్రక్షాళనకు బలమైన మద్దతుదారులంతా ప్రధానంగా ఇజ్రాయెల్ దురాక్రమణను సమర్థిస్తున్నవారే! మరోమాటలో ఈ తీవ్ర మితవాదులంతా దేశాన్ని నిరంకుశ మతరాజ్య వ్యవస్థగా మార్చి, ఆక్రమణలతో దేశాన్ని విస్తరించాలని కోరుకుంటున్న వారే.

దశాబ్దాల కష్టంతో నిర్మాణమైన దేశ ప్రజాస్వామ్య వ్యవస్థల సుస్థిరతకూ, అభివృద్ధికీ, భద్ర తకూ దేనికీ ఇది శ్రేయోదాయకం కాదు. ప్రజాస్వామ్య విలువల పునాదిపై ఎదిగి, పొరుగు దేశాలకు తనను కాస్తంత భిన్నంగా నిలిపిన ఆ మౌలిక సూత్రాన్నే కాలరాస్తానంటే అది ఇజ్రాయెల్‌కు ఆత్మ హననమే.

బిల్లుతో నెతన్యాహూ బలోపేతులయ్యారేమో కానీ, ఇజ్రాయెల్ బలహీనమైపోయింది.

# ఈ 8 వినాయక మందిరాలను దర్శిస్తే ఎంతటి కష్టాలైనా తొలగిపోవాల్సిందే



**మహారాష్ట్రలో పుణె, అహ్మద్‌నగర్, రాయ్‌గఢ్ జిల్లాల్లో స్వయంభువులుగా పేర్కొనే ఎనిమిది వినాయక మందిరాలు ఉన్నాయి. మయూరేశ్వర్ మొదలుకొని మహాగణపతి వరకు వరుసగా ఈ ఎనిమిది మందిరాలను దర్శించుకోవడం ఆనవాయితీ. మహాగణపతి ఆలయం తర్వాత మళ్లీ మోరేశ్వర్‌ను దర్శించుకోవడంతో అష్ట వినాయక పరిక్రమ పూర్తవుతుంది. ఇలా చేస్తే అష్ట వినాయకుల అనుగ్రహంతో అష్టకష్టాలూ తొలగిపోయి, సకల శుభాలనూ పొందుతారనేది భక్తుల విశ్వాసం.**

### మోరేశ్వరుడు

పుణె నుంచి 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న మోర్‌గావ్‌లో



కొలువుదీరిన గణపతి మోరేశ్వర్ లేదా మయూరేశ్వర్. ఈ పట్టణం ఒకప్పుడు నెమళ్ల (మయూరాలు)కు ప్రసిద్ధిచెందిందని, అందుకే మోర్‌గావ్ అనే పేరు వచ్చిందని అంటారు. అంతేకాకుండా, సాధారణంగా నెమలి కుమారస్వామి వాహనం. ఇక్కడ మాత్రం ఆయన అన్న గణపతి నెమలి వాహనుడై కొలువుదీరడం విశేషం. సింధువు అనే రాక్షసుణ్ని సంహరించడానికి గణపతి మయూరేశ్వరుడిగా అవతరించాడని కథ ప్రచారంలో ఉంది.

### సిద్ధివినాయకుడు

ఈ ఆలయం అహ్మద్‌నగర్ జిల్లాలోని సిద్ధటేక్‌లో ఉంది. ఎనిమిది



వినాయక మందిరాల్లో ఏడింటిలో వినాయకుడి తొండం ఎడమ వైపు తిరిగి ఉండగా, ఒక్క సిద్ధటేక్‌లో మాత్రం కుడివైపు తిరిగి ఉంటుంది. పేరులో ఉన్నట్లుగానే ఇక్కడి వినాయకుడు భక్తుల కోరికలను తీర్చే కామధేనువు.



### బళ్లాలేశ్వరుడు

ఈ మందిరం రాయ్‌గఢ్ జిల్లా పాలి గ్రామంలో ఉంది. తన భక్తితో వినాయకుడిని మెప్పించిన బళ్లాలుడు అనే యువకుడి పేరుమీద ఇక్కడి స్వామికి, 'బళ్లాలేశ్వర్' అనే పేరు నిలిచిపోయింది. తమ కోరికలు నెరవేరడానికి అకుంఠిత భక్తితో భక్తులు ఈ ఆలయాన్ని సందర్శిస్తారు.

### వరద వినాయకుడు

పుణెకు దగ్గర్లో ఉన్న మహద్ గ్రామంలో కొలువుదీరిన మూర్తి వరద వినాయకుడు. పేరులో ఉన్నట్లుగానే ఇక్కడి స్వామి తన దగ్గరికి వచ్చే భక్తులకు విజయాలను ప్రసాదిస్తాడు. ఇక్కడ ఆలయంలో నందాదీపంగా పిలిచే ఒక నూనె దీపం 1892 నుంచి అఖండంగా వెలుగుతూ ఉందని విశ్వసిస్తారు.

### చింతామణి గణపతి

ఈ ఆలయం పుణె నుంచి సుమారు 25 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ఓసారి కపిల మహర్షి కోసం గణపతి గుణాసురుడితో పోరాడాల్సి వస్తుంది. భీకరమైన యుద్ధం తర్వాత చింతామణి



సాయంతో అందులో వినాయకుడు గెలుస్తాడు. అందుకే చింతామణి గణపతి అనే పేరు స్థిరపడిపోయింది. ఇక్కడి స్వామిని మనస్ఫూర్తిగా ఆరాధిస్తే కోరిన కోరికలు తీరుతాయని నమ్ముతారు.

### గిరిజాత్మజుడు



పుణె సమీపంలోని లేన్యాద్రి గుహల్లో కొలువుదీరిన గణపతే



గిరిజాత్మజుడు. గిరిజాదేవి పార్వతి కొడుకు కోసం ఇక్కడ తపస్సు చేసిందని ఐతిహ్యం. అందుకే ఇక్కడి స్వామికి గిరిజాత్మజుడు అనే పేరు వచ్చింది. మిగిలిన మూర్తులకు భిన్నంగా, గుహ కుడ్యానికి మలచిన రూపాన్ని కలిగి ఉంటాడు ఇక్కడి స్వామి. 18 గుహల



సముదాయంలో 7వ గుహలో గిరిజాత్మజుడు కొలువై ఉన్నాడు.

### విఘ్నహరేశ్వరుడు

పుణె నాసిక్ మార్గంలో ఓజార్ పట్టణంలో వెలసిన దేవుడు విఘ్నహరుడు. విఘ్నాసురుడు అందరికీ విఘ్నాలు కలిగించేవాడు. అయితే గణపతి చేతిలో ఓడిపోవడంతో విఘ్నాసురుడు క్షమించమని స్వామి కాళ్లమీద పడతాడు. తన పేరు గణపతితో కలిసి ఉండాలని వరం కోరుకుంటాడు. అలా ఇక్కడి దేవుడికి విఘ్నహరేశ్వరుడు అనే పేరు నిలిచిపోయింది. చేపట్టిన పనుల్లో ఆటంకాలు తొలగిపోవాలనుకునే వాళ్లు విఘ్నహరుణ్ని పూజిస్తారు.

### మహాగణపతి



పుణెకు 50 కిలోమీటర్ల దూరంలో రంజన్‌గావ్‌లో కొలువుదీరాడు. ఇక్కడి దేవుడిని మహాగణపతి రూపంలో కొలుస్తారు. త్రిపురాసుర సంహారానికి ముందు పరమేశ్వరుడు తనకు విఘ్నాలు కలగకుండా ఉండటానికి ఇక్కడే తన కొడుకైన గణపతిని ప్రార్థించాడని స్థల పురాణం.

# ఎండిన పండ్లతో... మెండైన ఆరోగ్యం

డ్రైఫ్రూట్స్‌ను మనందరం చాలా ఇష్టంగా తింటుంటాం. ఈ ఎండిన పండ్లలో మనకు బాగా తెలిసినవి ఎండు ద్రాక్ష, ఎండు ఖర్జూర వంటివి కొన్నే. కానీ... ఇటీవల అలాంటి డ్రైఫ్రూట్ ఎన్నెన్నో మనకు అందుబాటులోకి వస్తున్నాయి. పైగా అవి ఎన్నెన్నో వ్యాధుల నివారణకూ తోడ్పడుతున్నందువల్ల వాటిపై ఆసక్తి కూడా బాగా పెరిగింది. ఇటీవల వాటి లభ్యత కూడా బాగానే పెరిగింది. కొన్ని ఎండు పండ్లు... ఎన్నో వ్యాధుల నివారణతో బాగా మన ఆరోగ్య పరిరక్షణలో, వాటితో ఒనగూరే ప్రయోజనాలపై అవగాహన కలిగించుకునేందుకు తోడ్పడేదే ఈ కథనం. సాధారణంగా ఆరోగ్యాన్ని కలిగించేవి కాస్తంత చేదుగానో, ఘాటుగానో, వగరుగానో ఉంటాయి. వాటిని తినడానికి మనం ఒకింత ఇబ్బంది పడుతుంటాం కూడా. కానీ ఎండిన పండ్లు మంచి రుచిగా ఉంటాయి కాబట్టి ఇష్టంగానే మనం వీటిని తింటుంటాం. అలా ఇష్టంతో, మంచి రుచితో కొన్ని జబ్బులను నివారించుకునే మార్గాలను చూద్దాం. రక్తహీనత తగ్గించే ఎండు ఖర్జూర: సాధారణంగా మహిళలందరిలోనూ రక్తహీనత కనిపిస్తుంటుంది. ప్రతినెలా అయ్యే రుతుస్రావం వల్ల ఈ కండిషన్ ఉంటుంది. రక్తహీనతను నివారించే మంచి మార్గాల్లో ఎండు ఖర్జూరం ఒకటి. బాగా నీరసంగా ఉండేవారికి సైతం ఎండు ఖర్జూర మంచి ఉపయోగకారి. చాలాసేపు ఏమీ తినకుండా ఉండి, దేహంలో చక్కెర పాళ్లు తగ్గి, నీరసంగా ఉన్నవారిలో ఆ నిస్సత్తువను తక్షణం తగ్గించేందుకు ఎండు ఖర్జూరాలు తోడ్పడతాయి. వీటిలో ఉండే చక్కెర వల్ల కేవలం ఒకటి రెండు ఎండు ఖర్జూరాలతోనే అన్నం తిన్నంత ఫలితం ఉంటుంది. అలాగే ఎండిన అత్తిపండ్లు (డ్రై%--% ఫిగ్స్) తినడం వల్ల దీనిలోని ఐరన్, విటమిన్%--%సి వల్ల రక్తహీనత తగ్గడంతోపాటు వ్యాధినిరోధక శక్తి కూడా పెంపొందుతుంది. రక్తహీనత నివారణకు మాంసాహారం... ముఖ్యంగా మాంసాహారాల్లోనూ కాలేయం బాగా తీసుకోవాలని డాక్టర్లు సూచిస్తారు. అయితే కఠినంగా శాకాహార నియమాలు పాటించేవారికి ఇది ఒకింత ఇబ్బంది కలిగించే పరిష్కారం. అలాంటివారందరూ ఎండిన ఫిగ్స్‌పై ఆధారపడవచ్చు. రక్తహీనతతో బాధపడేవారిలో మాంసాహారంలోని కాలేయం వంటివి తీసుకుంటే ఎలాంటి ఫలితాలు ఒనగూరుతాయో... ఎండిన ఫిగ్స్‌తోనూ అవే ప్రయోజనాలు చేకూరతాయి. అధిక రక్తపోటు నివారణకు ఎండు ఆప్రికాట్: సాధారణంగా హైబీపీతో బాధపడేవారికి అరటిపండ్లు తినమని డాక్టర్లు సూచిస్తుంటారు. అరటిపండులో పుష్కలంగా ఉండే పొటాషియమ్ రక్తపోటును నివారిస్తుంది/నియంత్రిస్తుంది. అందుకే ఆ సూచన చేస్తుంటారు. అయితే ఒక అరటి పండులో కంటే ఒక ఎండిన ఏప్రికాట్‌లో మూడు రెట్లకు మించి కాస్తంత ఎక్కువగానే పొటాషియమ్ ఉంటుంది. దాంతో హైబీపీ బాగా తగ్గుతుంది. అట్లాంటాలోని సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ అనే సంస్థ నిర్వహించిన అధ్యయనంలో పొటాషియమ్ ఎక్కువగా తీసుకోవడం అన్నది హైబీపీ నియంత్రిస్తుందని తేలింది. (దీనికి భిన్నంగా సోడియమ్ అన్నది రక్తపోటును పెంచుతుందన్న విషయం తెలిసిందే. అందుకే రక్తపోటు పెరిగే ప్రమాదం ఉన్నందున ఉప్పు ఎక్కువగా తీసుకోవద్దంటూ డాక్టర్లు సూచిస్తుంటారు కూడా). అందుకే హైబీపీ నియంత్రణకు ఎండిన ఏప్రికాట్ మంచి రుచికరమైన మార్గం. ఆస్టియోపోరోసిస్‌ను నివారించే రెయిసిన్స్ : ఇటీవల రకరకాల రెయిసిన్స్ (కిస్‌మిస్ లాంటివే అయినా బాగా ఎండిన మరో రకం ద్రాక్ష) మెనోపాజ్‌కు చెరుకున్న మహిళల్లో అత్యంత సాధారణంగా కనిపించే ఆస్టియోపోరోసిస్‌ను నివారిస్తాయి. వాళ్ల ఎముకలను పటిష్టం చేస్తాయి. సాధారణంగా మహిళలందరిలోనూ ఒక వయసు దాటాక ఎముకల సాంద్రత తగ్గుతుంది. (ఈ పరిణామం అందరిలోనూ కనిపించినా... మెనోపాజ్ దాటాక మహిళల్లో మరింత ఎక్కువ. అందుకే ఎముకలను పెళుసుబార్చి తేలిగ్గా విరిగేలా చేసే ఆస్టియోపోరోసిస్ వాళ్లలోనే ఎక్కువ). సాధారణంగా పాలు, పాల ఉత్పాదనల్లో కాల్షియమ్ ఎక్కువ. అందుకే పెరుగులో కొన్ని రెయిసిన్స్ ముక్కలతో పాటు మన దగ్గర ఇటీవలే లభ్యత పెరిగిన 'పెకాన్స్' వంటి ఎండుఫలాలను కలిపి తీసుకుంటే మరింత మంచి ప్రయోజనం కనిపిస్తుంది. మలబద్ధకాన్ని నివారించే ప్రూన్స్: ఈ ప్రూన్స్ కూడా కిస్‌మిస్, రెయిజిన్స్ లాంటి మరో రకం ఎండు ద్రాక్ష. కాకపోతే అవి నల్లటి రంగులో కిస్‌మిస్, రెయిజిన్స్ కంటే పెద్దవిగా ఉంటాయి.

# శేరిలింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి సమస్యను పరిశీలించిన సిపి స్టీఫెన్ రవీంద్ర

**-డీసీపీ సందీప్ రావు తో కలిసి**

**కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్**





శేరిలింగంపల్లి (ప్రశ్న న్యూస్) లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారి వర్షాలకు గోపిచెరువు సరిహద్దు కట్టతెగి వరద నీటి ప్రవాహం భారీగా చేరినందున ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడి ప్రజలు ఇబ్బంది పడుతున్న కారణంగా శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ సిపి స్టీఫెన్ రవీంద్ర, డీసీపీ సందీప్ రావు తో కలిసి పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగ సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి ఉప్పొంగుతున్న వరద నీటి సమస్యకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై సూచించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ రోడ్డు డివైడనింగ్ గురించి కోఆర్డినేషన్ కమిటీ మీటింగ్ లో చర్చించి సమస్య పరిష్కారం కొరకు కృషి చేస్తానని అన్నారు. కురుస్తున్న వర్షాలను దృష్టిలో పెట్టుకుని అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## స్వామి కుటుంబానికి అండగా బ్యాచ్ మేట్స్

## కానిస్టేబుల్ స్వామి కుటుంబానికి ఆర్థిక సహాయం



పంజాగుట్ట (ప్రశ్న న్యూస్) పంజాగుట్ట పోలీ స్ స్టేషన్ నందు 2010 బ్యాచ్ సంబంధించిన స్వామి అనే కానిస్టేబుల్ ఆఫీసర్ ప్రమాదవశాత్తు స్వర్గస్తులవడం జరిగింది. కావున 27 గురువారం స్వామి యొక్క నివాసానికి వెళ్లి అతని భార్య, ముగ్గురు పిల్లల్ని పరిమర్శించడంతోపాటు మా బ్యాచ్ తరపున 4 లక్షల 19 వేల రూపాయలు పోగుచేసి అందులో నుండి అతని ముగ్గురు పిల్లలపై 4 లక్షల రూపాయలు ఫిక్స్ డిపాజిట్ చేసి దానికి సంబంధించిన బాండ్ ను మిగిలిన 19 వేల రూపాయలను స్వర్గీయ స్వామి యొక్క భార్య అయిన కావ్య కు నగదు రూపంలో అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో 2010 బ్యాచ్ తరపున మామిడి కేశవ్, బోలా శంకర్, శ్రీకాంత్, శివ, రాఘవాచారి, విష్ణు, నరసింహ, కృపానందం, వెంకటేష్, కోటేష్, దశరథ్, అరవింద్, డి టీ నాయక్, భవ్య శాంతి తదితరులు పాల్గొన్నారు.

## లింక్ డాక్యుమెంట్ పోయింది

నేను, పడమల నాగేశ్వర్ రెడ్డి, 15/07/2023న హైదరాబాద్లోని అంబర్ పేట నుండి కొత్త పేటకు బస్సులో వెళ్తుండగా కొహెడ గ్రామ పరిధిలోని నా ప్లాట్ నంబర్ 59, సర్వే నెంబర్ 486 యొక్క ఒరిజినల్ లింక్ డాక్యుమెంట్ పోగొట్టుకున్నాను. ఎవరికైనా ఎక్కడైనా కనిపిస్తే దయచేసి తెలియజేయండి. దయచేసి 8686211422ను సంప్రదించండి

## భారీ వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : మేయర్ పారిజాత నర్సింహరెడ్డి



భడంగ్ పేట్ (ప్రశ్న న్యూస్) భారీగా కురుస్తున్న కుండపోత వర్షాల వల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని భడంగ్ పేట్ మున్సిపల్ కార్పోరేషన్ మేయర్ పారిజాత నర్సింహరెడ్డి సూచించారు. భారీ వర్షాల వల్ల భడంగ్ పేట్ పరిసర ప్రాంతాల్లోని ప్రజలు అవసరమైతేనే ఇండ్ల నుండి బయటకు రావాలని అలాగే చల్లని ఈదురు గాలలు వీస్తుండడంతో అనారోగ్య సమస్యలు, సీజనల్ వ్యాధులు ప్రభలే ప్రమాధముందని, దీంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి ఒక్కరు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వర్షం నీరు నిల్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, తమ పరిసర ప్రాంతాలలో నీరు నిలిచే అవకాశమున్న వాటిని తోలగించుకోవాలని సూచించారు. అదే విధంగా విద్యుత్ స్థంబాలకు, వైర్లకు ,ట్రాన్స్ఫార్మర్ల వద్దకు వెళ్ళవద్దని రోడ్ల పై ప్రయాణించే సమయంలో మ్యాన్ హెూల్స్, డ్రైనేజీలను గమనిస్తు ముందుకు పోవాలని హెచ్చరించారు. ఒక్కసారిగా వాతావరణంలో చోటు చేసుకున్న మార్పుల వల్ల సీజనల్ వ్యాధులు విష జ్వరాలు ప్రభలే అవకాశాలు వున్నాయని అయితే మనం కొన్ని జాగ్రత్తలు పాటిస్తే వీటికి ధూరంగా ఉండవచ్చని తెలిపారు. అలాగే మన ఇండ్లలో ఉండే చిన్న పిల్లల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. భారీ వర్షాల వల్ల ఏవైన సమస్యలు ఉత్పన్నమైన యడల వెంటనే ఆధికారుల దృష్టికి తేవాలని సూచించారు. అలాగే కార్పోరేషన్ అధికారులు, సిబ్బంది అప్రమత్తగా ఉండి అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

## బోనాల పండుగ వేడుకల్లో పాల్గొన్న బండారి లక్ష్మారెడ్డి



ఉప్పల్ (ప్రశ్న న్యూస్) ఉప్పల్ మహంకాళి అమ్మవారి టెంపుల్ మరియు ఈదమ్మ గుడి ధర్మకర్త నర్సింగ్ రావు ఆహ్వానం మేరకు ఈదమ్మ బోనాల పండుగ వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన బి ఎల్ ఆర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు భారాస రాష్ట్ర నాయకులు బండారి లక్ష్మారెడ్డి ఈ సందర్భంగా బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఆ అమ్మవారి దయ వల్ల ఉప్పల్ నియోజకవర్గ ప్రజలు సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం లో ఆలయ ధర్మకర్త మహంకాళి నర్సింహా ముదిరాజ్ ,గుమిడేల్లి నర్సింగ్ రావు, ఉప్పల్ డివిజన్ బిఆర్ఎస్ నాయకులు ఆకుల మహేందర్, అన్న బాలకృష్ణ, బాషపల్లీ నిరంజన్ చారి, సుక్క కిరణ్, ఏమాండ్ల రామ్ రెడ్డి, అల్వాల్ నాగరాజ్ ముదిరాజ్ రాజు లింగాయత్ మస్తాన్ భాయ్, శ్రీనివాస్ చారి, కడిగే శేఖర్ రావుల నవీన్ గౌడ్, బాబు సతీష్ చారి ,సల్ల రాజీ రెడ్డి, కాయల చందు, సిద్దయ్య, రోషయ్య, నాగేందర్ రెడ్డి, కెసిఆర్, మేడిపల్లి నవీన్ చారి, సుధాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో రానున్న 48 గంటల్లో భారీ వర్షాలు అప్రమత్తంగా ఉండండి

**- డీజీపీ అంజనీ కుమార్**

**- భారీ వర్షాల నేపథ్యంలో పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన డీజీపీ**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) రాష్ట్రంలో రానున్న రెండు రోజుల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశమున్నందున రాష్ట్రంలోని పోలీస్ యంత్రాంగాన్ని అప్రమత్తం చేయడం జరిగిందని డీజీపీ అంజనీ కుమార్ తెలిపారు. రానున్న 48 గంటలలో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో చేపట్టాల్సిన ముందుజాగ్రత్త చర్యలపై పోలీస్ కమీషనర్లు, ఎస్.పిలతో నేడు రాత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. శాంతి భద్రతల విభాగం అదనపు డీజీ సంజయ్ కుమార్ జైన్ కూడా పాల్గొన్న ఈ వీడియో కాన్ఫరెన్స్ లో డీజీపీ అంజనీ కుమార్ మాట్లాడుతూ,పోలీస్ యంత్రాంగం 24గంటలు అందుబాటులో ఉంటారని సహాయం కోసం డయల్100 కి లేదా స్థానిక పోలీసు పోలీసులకు గానీ సమాచారం అందిన వెంటనే తగు సహాయక చర్యలు చేపట్టడం జరుగుతుందని స్పష్టం చేశారు. రేపు దాదాపుగా 8 జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది, రెడ్ అలర్ట్ ప్రకటించారని, అలాగే రేపు కొన్ని ఈశాన్య, తూర్పు తెలంగాణతో పాటు పశ్చిమ తెలంగాణలోని జిల్లాలకు కూడా రెడ్ అలర్ట్ ఉందని తెలిపారు. హైదరాబాద్లో ఈ రెండు రోజుల పాటు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అన్నారు. ఇప్పటికే గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల పలు ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు పూర్తిగా నిండాయని, ఈ జలాశయాల వద్దకు ఎవరు వెళ్లకుండా తగు ముందు జాగ్రత చర్యలు చేపట్టాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. వరద ఉదృతితో తెగిపోయిన రోడ్లు, ఉధృతంగా ప్రవహించే కాజ్ వేల వద్దకు ప్రజలు వెళ్లకుండా,రెండు దిక్కులా ప్లాస్టిక్కోన్స్,బారిగేడ్స్, హెచ్చరిక గల ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్తగా ట్రాఫిక్ డైవర్షన్ చేయాలని ఆదేశించారు భద్రద్రి కొత్తగూడెం జిల్లాలో చర్ల లోని లోతట్టు ప్రాంతాలలోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం జరిగిందని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ఎన్డీఆర్ఎఫ్ బృందాలను ఉపయోగించుకోవాలని అన్నారు. రైతులు పొలాల్లో విద్యుత్ మోటార్ల వద్ద జాగ్రత్తగా ఉండాలి,వర్షాలు పడేటప్పుడు విద్యుత్ స్తంభాలను గాని,వైర్లను గానీ చేతులతో తాకకుండా, ఇతర జాగ్రత చర్యలపై సమాచార మాధ్యమాల ద్వారా ప్రజలను చైతన్య పర్చాలని ఆదేశించారు. వర్షాలకు కల్వర్టు, చిన్న చిన్న బ్రిడ్జిల వద్ద నీరు ప్రవహిస్తున్నప్పుడు వాహనాలతో దాటడానికి సాహసం చేయరాదు అని సూచించారు. జలపాతాలు, నిండిన చెరువుల మత్తళ్ల వద్దకు ప్రజలు వెళ్లకుండా జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు.

# నవోదయ విద్యాలయ సమితి కార్యాలయంలో జాయింట్ ప్రెస్ కాన్ఫరెన్స్




శేరిలింగంపల్లి (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ రీజియన్ కేంద్రీయ విద్యాలయ గచ్చిబౌలి నవోదయ విద్యాలయ రంగారెడ్డి వారి ఆధ్వర్యంలో నవోదయ విద్యాలయ సమితి కార్యాలయంలో 3సంవత్సరాల జాతీయ విద్యావిధాన ప్రగతి జాయింట్ ప్రెస్ కాన్ఫరెన్స్ జరిగింది. ఈ కార్యక్రమంలో నవోదయ విద్యాలయ సమితి, హైదరాబాద్ రీజియన్, ఉప సంచాలకులు తలపల గోపాల కృష్ణ, అసిస్టెంట్ కమీషనర్లు అభిజిత్ బెహరా, శ్రీమతి శాంతి, కేంద్రియ విద్యాలయ ప్రాచార్యులు మిత్రవిందారావు, జితేంద్ర, నవోదయ రంగారెడ్డి ప్రాచార్యులు విజయ భాస్కర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని సోమాజీ గూడ ప్రెస్ క్లబ్ జాయింట్ డైరెక్టర్ బాల కృష్ణ కాన్ఫరెన్స్ కు అధ్యక్షత వహించారు. ఉప సంచాలకులు తలపల గోపాల కృష్ణ, మాట్లాడుతూ జాతీయ విద్యా పథకం 2020 భారతీయ విద్యా వ్యవస్థలో అభ్యుదయ మార్పుకు దిక్ సూచిగా మారింది వినూతనమైన బోధనా పద్ధతులు, సాంకేతిక వినియోగం అంచనా పరికరాలు వాడుకలోకి వచ్చాయి. ఆంటీ ఇంటిగ్రేటెడ్ టాయ్ బేస్డ్ స్పోర్ట్స్ ఇంటిగ్రేటెడ్ పెడగోగి వంటివి విద్యార్థులకు సరికొత్త అభ్యాసనానుభావాన్ని కలిగించాయి.ఎక్స్పీరియన్సియల్ లర్నింగ్ ఇన్క్లూసివ్ ఎద్యూ కేషన్ విద్యారంగానికి కొత్త కొణాన్ని పరిచయం చేసాయి. పథకాన్ని సర్వాంగీన అభివృద్ధి వైపు తీసుకు వెళ్ళగలదు సరికొత్త మార్పులు మరింత విస్తారత రావడం వలన మనుకు విద్యాభ్యస ఫలితాలు వెంటనే తెలుస్తాయి విద్యార్థులలో జాతీయ సమైక్యత, సంపూర్ణ, సమగ్ర మూర్తిమత్వం కూడా ఈ పథకం అద్భుతమైన ఫలితాల నిస్తుంది. ని అమలు చేయడంలో తన పరిధిలో ఉన్న ప్రతి విద్యాలయంలో తగినట్లు ఏర్పాట్లు, శిక్షణ ఇవ్వడమే కాకా అ దిశలో విజయం కూడా సాధించింది విద్యార్థుల చేత విద్యార్థుల ద్వారా విద్యార్థుల కోసం రూపొందింప బడిన ఈ పథకంలో అనుభవ అభ్యసనం ఒక ముఖ్యమైన విశేషము. విద్యార్థులను చదువుకున్న వారిగా కాక, విద్యావంతులుగా స్వయం శక్తి కలిగిన వారిగా తీర్చిదిద్దడం ఉన్నత పౌరులుగా మార్చడం కూడా దీని ప్రధాన ఉద్దేశ్యం నిపుణ్ భారత్ యొక్క లక్ష్యాలను కూడా ఇది ఇముడుచుకున్నది. నిజానికిఆరవ తరగతి విద్యార్థులు నవోదయ లో ఉన్నప్పటికీ ఎవరికైతే ఈ నైపుణ్యాలలో వెనుకబాటు ఉందో వారి పట్ల కూడా శ్రద్ధ తీసుకోబడుతుంది. అన్ని విద్యా సంస్థలు పాటిస్తున్నప్పటికీ ప్రధానంగా విషయంలో నవోదయ ముందు ఉంది ప్రస్తుతం ఎంపిక పరీక్షలో దివ్యాంగులకు రిజర్వేషన్ కల్పించుట తో పాటభిన్నమైన విద్యాలయాలలో ఉన్న భిన్న సామర్థ్యము గల విద్యార్థులకు విద్య తో పాటు క్రీడా రంగంలో తగిన శిక్షణ ఇచ్చి, వారిని ఉత్తమ క్రీడాకారులుగా తీర్చి దిద్దుతున్నది అని తెలిపారు. అసిస్టెంట్ కమీషనర్,అభిజిత్ బెహరా ఉద్దేశ్యలను వివరించారు నవోదయ ప్రాచార్యులు శ్రీ విజయ భాస్కర్ నవోదయ విద్యాలయాలలో అమలును సోదాహరణంగా వివరించారు ఆ పైన ఉప సంచాలకులు తలపల గోపాల కృష్ణ,విలేఖరులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానములు ఇచ్చారు రంగారెడ్డి ప్రాచార్యులు విజయ భాస్కర్ అందరికి వందనములు సమర్పించారు.

## భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా వుండాలి

**- ప్రభుత్వ విప్ ఆరెకపూడి గాంధీ**



శేరిలింగంపల్లి (ప్రశ్న న్యూస్) ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ గాంధీ మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలందరూ అప్రమాత్రంగా ఉండలని అత్యవసర పరిస్థితి తప్ప ఇంటి నుండి బయటకు రావొద్దు అని ప్రతి ఒక్కరు కనీస స్వీయ రక్షణ చర్యలు పాటించాలని భారీ వానల నేపథ్యంలో అనవసరంగా రిస్కు తీసుకోవద్దని అత్యవసర మైతే తప్ప ప్రజలు బయటకు వెల్లకుండా వుండాలని ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని,తగు స్వీయ జాగ్రత్తలు పాటించాలని ప్రజలకు ప్రభుత్వ విప్ ఆరెకపూడి గాంధీ విజ్ఞప్తి చేశారు.అదేవిధంగా కరెంట్ స్థంబాలకు, విద్యుత్ వైర్లను ,ట్రాన్స్ఫార్మర్లను తాకావద్దు అని, మ్యాన్ హెూల్స్, డ్రైనేజీలను చూసుకొని నడవాలని, చిన్న పిల్లలను ఎట్టి పరిస్థితుల్లో సైతం ఇంటి నుండి బయటకు రాకుండా, పంపకుండా తల్లి తండ్రులు జాగ్రత్త పాటించాలని ప్రభుత్వ విప్ గాంధీ అన్నారు, పెద్ద వారు కూడా అత్యవసర పనుల కోసం మాత్రమే రావాలని కోరారు, సీజన్ మార్పుతో వాతావరణంలో వచ్చే మార్పుల వల్ల వైరల్ జ్వరాలు వచ్చే అవకాశాలు వున్నాయి, మి చుట్టూ పక్కల అత్యవసర పరిస్థతుల్లో పోలీస్ మరియు %+నవీజ% సిబ్బందికి గాని వార్డ్ కార్యాలయంకు గాని ,మా కార్యలయంకు గాని ఫోన్ ద్వారా సమాచారం అందించాలని కోరారు, ఎల్ల వేళలో అందుబాటులో ఉంటామని ఏ చిన్న సమస్య ఎదురైన మా దృష్టికి తీసుకువస్తే తప్పకుండా పరిష్కరిస్తామని ప్రభుత్వ విప్ గాంధీ తెలియచేశారు.

## సదా మీ సేవలో జిల్లా పోలీస్ యంత్రాంగం

**భారీ వర్షంలో సైతం ప్రజా రక్షణే ప్రథమ లక్ష్యంగా ఖాకీల సేవలు**

**వరదల్లో చిక్కుకున్నవారిని ఎప్పటికప్పుడు**

**సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్న పోలీసులు**





సిరిసిల్ల (ప్రశ్న న్యూస్) భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా, ప్రజా రక్షణే ప్రథమ లక్ష్యంగా జిల్లా పోలీస్ యంత్రాంగం ప్రజలను వరదల బారి నుండి తప్పించడానికి రక్షణ, సహాయక చర్యలను కొనసాగిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా నీటిలో చిక్కుకున్న సుమారు 80 కుటుంబాలను,సిరిసిల్ల పట్టణంలో సుమారు 60 మందిని, వివిధ మండలాల్లో సుమారు 140 మందిని,గర్భిణి మహిళలను, వృద్దులను వివిధ శాఖల సమన్వయంతో సురక్షిత ప్రాంతాలకు తరలించడం జరిగింది. జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు జిల్లాలోని పోలీస్ యంత్రాంగం ఉదయం నుండి ప్రజా రక్షణ ధ్యేయంగా ప్రజలకు అందుబాటులో ఉండి, క్షేత్ర స్థాయిలో ప్రమాదకరంగా ఉన్న చెరువులు, వాగులు, రహదారుల వద్ద సిబ్బందితో పాటు బారికేడింగ్ ఏర్పాటు చేశారు. శిథిలావస్థలో ఉన్న ఇండ్ల నుండి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే పనిలో జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది నిమగ్నమయ్యారు. రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్, పంచాయితీ శాఖలతో సమన్వయం చేసుకుంటూ రక్షణ చర్యలు కొనసాగిస్తున్నారు. భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా పోలీస్ యంత్రాంగం 24/7 అందుబాటులో ఉంటుంది అని ఎవరికి ఎలాంటి ఆపద వచ్చిన డయల్100 కి మీ దగ్గర్లో ఉన్న పోలీస్ వారికి సమాచారం అందిస్తే తక్షణ సహాయక చర్యలు చేప్పట్టడం జరుగుతుందన్నారు. ప్రజలు పోలీస్ వారి సూచనలు పాటిస్తూ అప్రాంతంగా ఉండాలన్నారు.

## అధికారులతో సఫిల్ గూడ చెరువు నీటిమట్టం పరిశీలించిన కార్పొరేటర్స్ శ్రవణ్

**సమస్యలు ఉంటే జిహెచ్ఎంసికి లేదా నాకు ఫోన్ చేయండి**





మల్కాజిగిరి (ప్రశ్న న్యూస్) తీవ్ర వర్షాల నేపథ్యంలో మల్కాజ్గిరి కార్పొరేటర్ శ్రవణ్ ఇరిగేషన్ డిపార్ట్మెంట్ డిఈ పవన్, ఎఈ పృద్వి, జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ ఎ ఈ దీపక్, ఎంతోమలజీ సూపెర్వైసోర్ మల్లేష్ తో పాటు సఫిలగూడ చెరువులో నీటి మట్టాన్ని పరిశీలించడం పరిశీలించారు. ఇరిగేషన్ డిపార్ట్మెంట్ అధికారులు నీటి మట్టాన్ని మానిటర్ చేయాలని కార్పొరేటర్ శ్రవణ్ కోరడం జరిగినది. దీంతోపాటు మల్కాజ్గిరి డివిజన్ పరిధిలోని సర్దార్ పటేల్ నగర్, బాల సరస్వతి నగర్, విష్ణుపురి, బలరాం నగర్, ఓల్డేరెడీమేట్, భగత్ సింగ్ నగర్ తదితర ప్రాంతాల్లో వర్ష ప్రభావాన్ని పరిశీలించారు. సమస్య ఉన్నవారు జిహెచ్ఎంసి కాల్ సెంటర్ నెంబర్ 04021111111 ను సంప్రదించాలని కార్పొరేటర్ శ్రవణ్ కోరారు.

## భారీ వర్షాల దృష్ట్యా అప్రమత్తం అయిన యంత్రంగం

**మున్సిపల్ ఛైర్పర్సన్, పోలీస్ అధికారులతో క్షేత్రస్థాయిలో పర్యటన**



సిరిసిల్ల (ప్రశ్న న్యూస్) జిల్లా వ్యాప్తంగా సహాయక చర్యలు చేపట్టిన జిల్లా జలమయమయ్యే ప్రాంతాలలోని ప్రజలను పునరావాస కేంద్రానికి తరలిస్తున్నారు. నర్మల ఎగువ ఎగువ మానేరు నీటి ఉధృతి ఎక్కువ స్థాయిలో ఉండటంతో ఎగువ మానేరు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అటు వైపుగా ఎవరు కూడా వెళ్ళవద్దని అన్నారు. ప్రజలు ప్రమాదాల భారీన పడకుండా వంతెనలపై రాకపోకలను నిషేధించి బారికేడ్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి గ్రామాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నామని అన్నారు. ఏలాంటి ఆటంకాల కలగకుండా తక్షణమే ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. 12 మందితో కూడిన జిల్లా డి ఆర్ ఎఫ్ టీమ్ 24 గంటలు అందుబాటులో ఉంటుంది అని అన్నారు. పిల్లలు, యువకులు సెల్ఫీలు తీసుకోవడానికి, ఈతలు కొట్టడానికి నీటి ప్రవాహాల దగ్గరికి వెళ్లకుండా తల్లిదండ్రులు దృష్టి సారించాలన్నారు. విపత్కర సమయాల్లో సహాయం కోసం డయల్100కి లేదా దగ్గరలో ఉన్న పోలీస్ వారికి సమాచారం అందిస్తే తక్షణ సహాయక చర్యలు చేపడుతం అని తెలిపారు.

# బాత్రూం గోడ కూలి మహిళ దుర్మరణం





**కోరుట్ల** కోరుట్ల పట్టణంలోని జవహర్ రోడ్ కు చెందిన బోస్సరి విజిత (29) స్నానం చేయడం కోసం బాత్రూం కు వెళ్లింది. గత ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు తడిసిన గోడ కూలి విజితపై పడింది. దీంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు గమనించి ఆమెను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే విజిత మృతి చెందిందని నిర్ధారించారు. ఆమె భర్త కాశీరామ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కోరుట్ల ఎస్సై ఈ కిరణ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతురాలికి ఇద్దరూ పిల్లలున్నారు. మృతురాలి కుటుంబాన్ని బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు అన్నం అనిల్ తోపాటు వివిధ పార్టీ ల స్థానిక నాయకులు పరామర్శించి కుటుంబాన్ని ఓదార్చారు.బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని ఎమ్మెల్యే ను కోరినట్లు అనిల్ తెలిపారు..

# జిల్లా యంత్రాంగం ముందస్తు చర్యలు



**జగిత్యాల** జిల్లాలో కురుస్తున్న వర్షాల వలన ప్రాణ నష్టం వాటిల్లకుండా జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అధికారులను ఆదేశించారు. గురువారం రోజున తన క్యాంపు కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ యాస్మిన్ బాషా జిల్లా, మండల అధికారులు, పోలీసు అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వాతావరణ శాఖ జిల్లాను రెడ్ అలర్ట్ గా ప్రకటించిందని, రానున్న 24 గంటలు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వర్షాలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా అధికార యంత్రాంగం ముందస్తు ప్రణాళికలతో సమన్వయంతో ఉండి, లోతట్టు, నీటి పరివాహక ప్రాంతాలలోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అన్నారు. జిల్లాలో 6 మండలాల్లోని 30 గ్రామాలు గోదావరి పరివాహక ప్రాంతాల్లో ఉన్నందున, శ్రీరాంసాగర్ ప్రాజెక్టు గేట్లు ఎత్తివేయడం ద్వారా నీటి ప్రవాహం వలన సమస్యలు రావడం జరుగుతాయని, ఆ గ్రామాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని అన్నారు. ప్రతీ మండలంలో సహాయ పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయాలని, ఆయా కేంద్రాలలో భోజనం, త్రాగు నీరు, బ్లాంకెట్లు, మందులు, వైద్య సిబ్బంది, తదితర ఏర్పాట్లు చేయాలని అన్నారు.

ఇప్పటికే 90 గ్రహాలలోని 296 మందిని సహాయ పునరావాస కేంద్రాలకు తరలించడం జరిగిందని తెలిపారు. తక్కువ ఎత్తు గల బ్రిడ్జి లపై నుండి ప్రవహించే ప్రాంతాల్లో రవాణా ఆపివేసి, బారి కెడ్స్ ఇరువైపుల ఏర్పాటు చేయాలని, ట్రాక్టర్లను అడ్డుగా కోట దూరం లో పెట్టలనీ సూచించారు. జిల్లాలోని చెరువుల్లో నీటి పరిమాణం లను గుర్తించి ప్రమాద స్థాయిలో ఉన్న చెరువు ప్రాంతాలలో ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని అన్నారు. జిల్లాలో 1064 చెరువులకు గాను, ఇప్పటి వరకు 877 చెరువులు సర్ ప్లస్ నీరు చేరిందని తెలిపారు. ఈ సమయంలో నైనా చెరువులు తెగిపోయే పరిస్థితులను గమనిస్తూ సమీప గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అన్నారు. వసతి గృహాల్లోనీ పిల్లలకు సౌకర్యాలు అందించాలని అన్నారు. గ్రామాల్లో పిల్లలు నీటి పరివాహక ప్రాంతాలలో సెల్ఫీ లు తీసుకోవడం జరుగుతున్నదని, వర్షాల వలన ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, సేల్ఫీ లు తీసుకోకుండా నిరోధించాలని సూచించారు. చేపలు పట్టేందుకు నీటి ప్రవాహాలకు అడ్డుగా వలలను వేస్తున్నట్లు అధికారులు తెలుపడంతో, వలల వలన నీటి ప్రవాహానికి అడ్డుగా ఏర్పడుతుందని, అట్టి వాటిని తొలగించాలని జిల్లా మత్స్య శాఖ అధికారి నీ ఆదేశించారు. గ్రామాలు, పట్టణాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండే విధంగా టామ్ టామ్ నిరంతరంగా నిర్వహించాలని పంచాయతీ, మునిసిపల్ అధికారులను ఆదేశించారు.

ఆర్డీఓ లు వారి పరిధిలో పర్యటించి వరద పరిస్థితులు, సహాయ పునరావాస కార్యక్రమాలను పర్యవేక్షించాలని అన్నారు. ఎస్పీ భాస్కర్ మాట్లాడుతూ, రానున్న 24 గంటల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, అలాగే ఎస్సారెస్పీ ప్రాజెక్టు గేట్లు ఎత్తి వేసే అవకాశం ఉన్నందున గోదావరి పరివాహక ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని అన్నారు. రాత్రి వేళల్లో నీటి ఉధృతి పెరగడం జరుగుచున్నది, రాత్రి వేళల్లో విధులు నిర్వహించేందుకు టార్చ్ లైటు, తాడు, జాకెట్, ఈతగాళ్లు లను అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 75 ప్రాంతాలలో స్ట్రీమ్స్ తెగిపోయాయని, ఆయా ప్రాంతాల్లో వాహనాలు, ప్రజలు తిరుగకుండా బారికెడ్స్ ఏర్పాటు చేసి, పోలీసులు గస్తీ ఏర్పాటు చేయడం జరిగాయని తెలిపారు.ఆనంతరం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దివాకర్ మాట్లాడుతూ, ఎట్లాంటి సంఘటనలు జరుగకుండా ముందస్తు ఏర్పాట్లు చేయడం, ప్రజలను అప్రమత్తం చేయాలని అన్నారు. సెల్ఫి తీసుకోకుండా నిరోధించాలని, చేపల వేటకు వెళ్లే వాళ్ళను ఆపివేయాలని , సహాయ పునరావాస కేంద్రాలు ఏర్పాటుచేసి, సౌకర్యాలు కల్పించాలని అన్నారు.ఆనంతరం అదనపు కలెక్టర్ బి.ఎస్.లత మాట్లాడుతూ, వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో వ్యవసాయ పనులకు ఎవరు కూడా వెళ్లకుండా గ్రామాలలో టామ్ టామ్ చేయాలని అన్నారు. ఇప్పటికే వెళ్లిన వారిని వెనక్కి పిలిపించాలని తెలిపారు. ఈ జూమ్ కాన్ఫరెన్స్ లో ఆర్డీవోలు , జిల్లా, మండల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# డేంజర్ జోన్లో కడెం ప్రాజెక్ట్

**నిర్మల్** కడెం ప్రాజెక్టు డేంజర్ జోన్ లో చిక్కుకుంది. ప్రాజెక్ట్ మీద నుండి ఓవర్ వరద నీరు ఫ్లో అవుతుండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు.

కడెం ప్రాజెక్టు ఇన్ ఫ్లో సామర్థ్యం 3.50 లక్షల క్యూసెక్కులు కాగా 6.04 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం కడెం ప్రాజెక్టులోకి వస్తోంది. దీంతో దిగువ ప్రాంతాల పూర్తిగా జలమయంలో దిక్కుకున్నాయి. గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు తెలుగు రాష్ట్రాల్లో ప్రాజెక్టులకు భారీగా వరద నీరు వచ్చి చేరుకుంతోంది. జలాశయాల నిండు కుండల్లా కనిపిస్తున్నాయి. తెలంగాణ, నిర్మల్ జిల్లాలోని కడెం ప్రాజెక్టు ప్రస్తుతం ఆందోళనకరంగా ఉంది. ఎగువ నుంచి వచ్చే వరదలతో పాటు భారీ వర్షాలతో అంచనాలకు మించి ఉగ్రరూపం దాల్చింది. ప్రాజెక్టు పైనుంచి నీరు ప్రవహిస్తుండటం అధికారులను ఆందోళనకు గురిచేస్తుంది. ఇప్పటికే లోతట్టు ప్రాంతాల ప్రజలను తరలించిన అధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు.

# మార్కాపురం చేరుకున్న మురారి బాపు

**మార్కాపురం:** గుజరాత్ కు చెందిన ప్రముఖ ఆధ్యాత్మిక గురువు మురారి బాపు ద్వాదశ జ్యోతిర్లింగ రామకథయాత్ర కార్యక్రమంలో భాగంగా శ్రీశైలం దర్శనం కోసం ప్రకాశం జిల్లా మార్కాపురం చేరుకున్నారు.

ప్రత్యేక రైలులో 1008 మంది శిష్య బృందంతో ఆయన ఉదయం 9:30 గంటలకు మార్కాపురం రైల్వే స్టేషన్ కు చేరుకోగా, వేదమంత్రోశ్చరణలు, మంగళ వాయిద్యాలు, భక్తుల జై శ్రీరామ్ నినాదాల నడుమ బాపు స్వామిని స్వాగతించారు. మార్కాపురం మార్వాడి సంఘం,, హరే కృష్ణ సంఘం, హిందూ సంఘాల ప్రతినిధులు ఆహ్వాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సులు, కార్లలో గుజరాత్ నుండి ప్రత్యేక రైలులో వచ్చిన స్వామీజీ, వారి శిష్య బృందం శ్రీశైలం తరలి వెళ్లారు. శ్రీశైలంలో ఆలయ కార్యనిర్వహణాధికారి లవన్న, స్వామిజీ..వారి శిష్య బృందానికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లను చేశారని స్వామి శిష్యులు తెలిపారు. దర్శనానంతరం శివాజీ స్ఫూర్తి కేంద్రం ఎదురుగా ఉన్న మైదానంలో రామకథ కార్యక్రమాన్ని స్వామిజీ చేపడుతున్నారు. అనంతరం స్వామిజీ శిష్య బృందం అదేరోజు సాయంత్రానికి బయలుదేరి మార్కాపురం చేరుకుని ఇక్కడ నుండి ప్రత్యేక రైలులో రామేశ్వరం వెళ్తారని వారి

# తిరుపతి అభివృద్ధిని దేశమంతా చూస్తున్నది

- మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరిత
- తిరుపతి అభివృద్ధి విశాలా రహదారులతోనే సాధ్యం
- డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి



**తిరుపతి** హింధూ ఆధ్యాత్మిక తిరుపతి నగరం అభివృద్ధి చెందితున్న పరిస్థితులను దేశమంతా చూస్తున్నదని తిరుపతి నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరిత తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా తిరుపతి అభివృద్ధికి నోచుకోక పోవడానికి ప్రధాన కారణం సరైన రహదారులు లేవనే విషయాన్ని గ్రహించిన మా కౌన్సిల్, యుద్ధ ప్రాతిపదికన మాస్టర్ ప్లాన్ రోడ్లను తీసుకురావడం జరిగిందని తిరుపతి నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం తిరుపతి నగరంలో 12,13 డివిజన్లకి కెనడినగర్, 6వ డివిజన్ కొత్తపల్లి, 45వ డివిజన్ శివజ్యోతినగర్లో గురువారం ఏర్పాటు చేసిన క్యాంపులలో సర్టిఫికెట్లను అందజేసే కార్యక్రమంలో తిరుపతి నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరిత ఐఏఎస్, డిప్యూటీ మేయర్లు భూమన అభినయ్ రెడ్డి, ముద్ర నారాయణ, తిరుపతి అర్బన్ తాసిల్దార్ వెంకటరమణ, స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు ఎస్.కె.బాబు, కార్పొరేటర్లు కోటురు ఆంజినేయులు, కేతం జానకి, అనీష్ రాయల్ హాజరై సర్టిపికెట్లు అందచేశారు.

మూడు క్యాంపులలో ప్రజలను ఉద్దేశించి మేయర్ డాక్టర్ శిరీష మాట్లాడుతూ ఈ నాలుగేళ్ళలో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఏమేమి హామిలిచ్చారో వాటిలో 98 శాతంకి పైగా నెరవేర్చారని, ఈ నాలుగేళ్ళలో నేరుగా అక్క చెల్లెమ్మల అకౌంట్లలోకి ఆసరా కావొచ్చు, విధ్యా ధీవెన కావొచ్చు, అమ్మఒడి కావొచ్చు, కాపునేస్తం కావొచ్చు ఇలా అన్ని పథకాల ద్వారా ప్రజలకి అందించిన మొత్తం 3 లక్షల 39 వేల కోట్ల రూపాయాలన్నారు. తిరుపతి నగరంలో అర్హులైన 26,500 మందికి ఇంటి పట్టాలు ఇచ్చి, ఇళ్ళు నిర్మిస్తూ, పేదవాళ్ళ పక్షంగా నిలబడి పనిచేస్తున్న జగన్ మోహన్ రెడ్డికి మనమంతా తోడుగా నిలబడాలని ప్రజలను ఉద్దేశించి మేయర్ డాక్టర్ శిరీష విజ్ఞప్తి చేశారు. తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత మాట్లాడుతూ ఇప్పటికే తిరుపతి నగరంలో జరిగిన జగనన్న సురక్ష క్యాంపుల ద్వారా ప్రజలు వారికి అవసరమైన 11 రకాల సర్టిఫికెట్లు అన్ని ఉచితంగా అందుకున్నారని, ఈ కార్యక్రమం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని, ఈ కార్యక్రమానికి సహకరించిన సచివాలయ సిబ్బందికి, వాలంటీర్లకు అభినందనలు తెలుపుతూ, ఈ కార్యక్రమం ఇంతటితో ముగియలేదని, అర్హత వుండి, ప్రజా పథకాలు పొందని వారు ఎప్పుడు వచ్చినా అధికారులుగా మేము సేవలందిస్తానని కమిషనర్ హరిత ఐఏఎస్ తెలిపారు. తిరుపతి నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా పథకాలను అమలు చేస్తూ, పేద ప్రజల పట్ల చిత్తశుద్ధితో పని చేస్తున్న మన ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిని రాబోవు కాలంలో కూడా ముఖ్యమంత్రిని చేస్తేనే ప్రజా పథకాలు అమలు అవుతాయనే విషయాన్ని మీరంతా గ్రహించి, జగనన్నకు మద్దతివ్వాలని అభినయ్ రెడ్డి విజ్ఞప్తి చేసారు. తిరుపతి ప్రజలంతా ఈ రెండు సంవత్సరాల్లో జరుగుతున్న అభివృద్ధిని గమనించి, పని చేస్తున్న మాకు తోడ్పాటు నివ్వండి, రాబోవు కాలంలో మరింతగా మీకు, తిరుపతి నగరాభివృద్ధికి కృషి చేస్తామని డిప్యూటీ మేయర్ అభినయ్ రెడ్డి విజ్ఞప్తి చేసారు. డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ మాట్లాడుతూ నిరంతరం పేదల పక్షనా నిలబడుతూ వారి అభివృద్ధికి పాటుపడుతున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిని గెలిపిస్తే మనందరికి అభివృద్ధి జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పుల్లూరు అమర్నాధరెడ్డి, అదనపు కమిషనర్ సునీత, డిఈలు విజయకుమార్ రెడ్డి, సంజీవ్ కుమార్, జేసిఎస్ నాయకులు బాలిశెట్టి కిశోర్, ఉదయగిరి రమేష్, దొడ్డారెడ్డి మురళీ, నాయకులు తాళ్ళూరి ప్రసాద్, రాపూరి ప్రసాథ్, నల్లానీ బాబు, శ్యామల, రాజేశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో జగనన్న విదేశీ విద్యా దీవన కింద 15 మంది విద్యార్థులకు రూ. 2,31,04,001 జమ



**తిరుపతి :** రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బిసి మైనారిటీ, అగ్రవర్ణాలకు చెందిన పేద విద్యార్థులు ప్రపంచంలోని టాప్ యూనివర్సిటీల్లో ఉన్నత విద్యా కోర్సులు అభ్యసించేందుకు అవసరమైన ఆర్థిక సాయం అందించే దిశలో జగనన్న విదేశీ విద్యా దీవెన అమలులో భాగంగా రాష్ట్రంలో ఈ ఏడాది టాప్ ఖిఅ విదేశీ యూనివర్సిటీల్లో అడ్మిషన్లు పొందిన అర్హులైన 357 మంది విద్యార్థులకు సాయంగా రూ. 45.53 కోట్లను కంప్యూటర్ బటన్ నొక్కి లబ్దిదారుల ఖాతాల్లో తాడేపల్లి క్యాంప్ కార్యాలయం నుండి నేటి గురువారం ఉదయం సంబంధిత మంత్రులతో కార్యదర్శులతో కలిసి వర్చువల్ విధానంలో గౌరవ ముఖ్యమంత్రి లబ్దిదారుల ఖాతాల్లో జమ చేయగా, తిరుపతి కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ కే వెంకట రమణ రెడ్డి సంబంధిత అధికారులతో, లబ్ధిదారులతో కలిసి హాజరయ్యారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం విద్యకు పెద్ద పీట వేసిందని, నేడు గౌ. రాష్ట్ర ముఖ్యమంత్రి కంప్యూటర్ బటన్ నొక్కి రాష్ట్ర వ్యాప్తంగా విదేశీ విద్యా దీవెన నగదు అర్హులైన లబ్దిదారుల ఖాతాల్లో జమ చేసారని, గత విద్యా సంవత్సరం 2022-23, ఈ విద్యా సంవత్సరం 2023-24 కు గాను టాప్ విదేశీ యూనివర్శిటీల్లోని వాటిలో అడ్మిషన్లు పొందిన జిల్లాలోని మొత్తం అర్హత కలిగిన 15 మంది విద్యార్థులకు చెందిన ఖాతాల్లో రూ. 2,31,04,001 నగదు జమతో లబ్ది చేకూరిందని తెలిపారు. మన తిరుపతి జిల్లాలోని ముగ్గురు విద్యార్థులు ఈ పథకం కింద ఎంపిక కాగా, వారు ఈబి.సి కేటగిరీలో ఎంపిక అయ్యారని వారికి రూ. 38,58,242, గత 2022-23 విద్యా సంవత్సరం కు చెందిన విద్యార్థులకు రూ. 1,92,45,759 లబ్ది చేకూరింది అని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని ముగ్గురు ఈబిసి విద్యార్థులకు మొదటి వాయిదా ట్యూషన్ ఫీ రీయింబర్స్మెంట్ 25శాతం మొత్తాన్ని లబ్ధిదారులు చింతా చరణ్ కుమార్ రెడ్డి, కంప్యూటర్ సైన్సెస్ న్యూయార్క్ యూనివర్సిటీ, న్యూయార్క్ సిటీ కొరకు రూ. 15,36,500 పులిచెర్ల జవహర్ రెడ్డి అకౌంటింగ్ అండ్ ఫైనాన్స్ కోర్స్ యూనివర్సిటీ ఆఫ్ ఎడిన్ బర్గ్, యుకే రూ. 9,82,505 లెక్కలపూడి దషితా చౌదరి ఇండస్ట్రియల్ ఇంజినీరింగ్, న్యూయార్క్ యూనివర్సిటీ, న్యూయార్క్ సిటీ రూ. 13,39,236 నగదు వారి ఖాతాల్లో జమ అయిందని తెలిపారు.ఖీూ ప్రపంచ ర్యాంక్ విదేశీ విశ్వవిద్యాలయాలలో/ టైమ్స్ హైయ్యర్ ఎడ్యుకేషన్ రాంకింగ్ ప్రకారం మెడిసిన్, లా, జర్నలిజం, మొదలైన 21 ఫాకల్టీలకు సంబంధించి టాప్ 50 ర్యాంకులు సాధించిన యూనివర్సిటీల్లో ప్రవేశం పొందిన ూఅ/ ూు/ ఃఅ/ మైనారిటీ మరియు ఇఃఅ విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించడానికి మెరిట్‌ను ప్రోత్సహించేందుకు, ప్రభుత్వం ఎస్సీ/ ఎస్టీ/ బీసీ/ మైనారిటీ విద్యార్థులకు గరిష్టంగా రూ. 1.25 కోట్ల వరకు, మిగిలిన విద్యార్థులకు గరిష్టంగా రూ. ఒక కోటి వరకు ఎంతైతే అంత వంద శాతం ట్యూషన్ ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను అందిస్తోందని విమాన, వీసా చార్జీలు సైతం రాష్ట్ర ప్రభుత్వం రీయింబర్స్మెంట్ ద్వారా ప్రపంచంలోని 320 కి పైగా ఉత్తమ కళాశాలల్లో ఉచితంగా చదువుకునేందుకు మన రాష్ట్ర విద్యార్థులకు అవకాశం కల్పించిందని కలెక్టర్ తెలిపారు. ఎక్కువ మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూర్చేందుకు కుటుంబ వార్షిక ఆదాయ పరిమితిని రూ. 8 లక్షలకు పెంచారని అన్నారు.

## భారీ వర్షాల నేపథ్యంలో

# కంట్రోల్ రూమ్ ఏర్పాటు



**జగిత్యాల** గత పది రోజుల నుండి అధికంగా వర్షాలు కురుసున్నందున జగిత్యాల జిల్లాలో అన్ని రకాల ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నామని, జిల్లా ప్రజల సహాయార్థం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు జగిత్యాల జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా తెలిపారు. జిల్లా లోని డివిజన్, మండల గ్రామల ప్రాంతాల్లో ఆర్డీవోలు, తాసీల్దారులు, రెవెన్యూ సిబ్బంది ప్రతిచోట అప్రమత్తంగా ఉండి సహాయక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ముందు జాగ్రత్త గా వరద తీవ్రంగా ఉన్న ప్రాంతాలలో ఆయా ప్రాంతాల్లోని కాలనీవాసులు మూగజీవులను ఇతర ప్రాంతాలను తరలిస్తున్నామని అన్నారు.అలాగే జిల్లా ఐడీవోసీ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, ఈ కంట్రోల్ రూమ్ వర్షాల వలన ఏమైనా సమాచారం ,తక్షణ సహాయం కోసం ఫోన్ నెంబర్ 08724 222557 ను సంప్రదించి విషయాలను తెలియ జేయాలని జిల్లా కలెక్టర్ తెలిపారు..

# నకిలీ నేవీ అధికారి అరెస్టు

**విశాఖపట్నం** విశాఖ పోలీసులు నకిలీ నేవీ అధికారిని అరెష్టు చేశారు. ఉపాధి పేరుతో నిరుద్యోగుల నుంచి అక్రమంగా వసూలు చేసేందుకు ప్రయత్నించిన సత్య సూర్య చలపతి అనే వ్యక్తిని అరెష్టు చేసి అతని వద్ద నుంచి సెల్ ఫోన్లు, కారును పోలీసులు సీజ్ చేశారు. నేవీలో గత పదేళ్లుగా అధికారిగా కొనసాగుతున్నానని కొంతమంది నిరుద్యోగులను సూర్య చలపతి మోసగిస్తున్నాడన్న విషయాన్ని గమనించిన నేవీ అదికారులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు నిందితుడ్ని అరెష్టు చేశారు.

# పొంగి పొర్లుతున్న వాగులు, వంకలు

**ఖమ్మం** తెలంగాణతో పాటు ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు రాష్ట్రంలోని వాగులు, వంకలు, జలపాతాలన్నీ పొంగి పొర్లుతున్నాయి. ముఖ్యంగా గోదావరి నది అయితే ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం క్రమంగా పెరుగుతూ వస్తోంది. నిన్ని వరకు 39 అడుగుల వద్ద ప్రవహించిన గోదావరి నది ఈరోజు ఉదయానికి 40 అడుగులకు చేరుకుంది. మధ్యాహ్నం 3 గంటలకు 44.4 అడుగులకు చేరుకోగా.. అప్రమత్తమైన అధికారులు మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. భద్రాచలం ఎగువన ఉన్న తాలిపేరు ప్రాజెక్టు నుంచి 23 గేట్లు ఎత్తి లక్షా 80 వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. నీటిమట్టం మరింత పెరిగితే ఈరోజు రాత్రి వరకు రెండో ప్రమాద హెచ్చరికను కూడా జారీ చేసే అవకాశం ఉందని అధికారులు వివరిస్తున్నారు.

నీటిమట్టం 43 అడుగలకు చేరితే మొదటి ప్రమాద హెచ్చరిక, 48 అడుగులకు చేరితే రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారు. భారీగా వర్షాలు కురుస్తుండడంతో గోదావరి నది పరివాహక ప్రాంత ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. ఏవైనా సమస్యలు, ఇబ్బందులు ఏర్పడితే అత్యవసర సేవలకు కంట్రోల్ రూమ్ కి ఫోన్ చేయాలని, ప్రజలు ఇళ్లన నుంచి బయటకు రావొద్దని సూచించారు. వర్షాల వల్ల పొంగి పొర్లుతున్న వాగులు దాటొద్దని అన్నారు. అలాగే ప్రజలందరూ అధికారులు చెప్పే సూచనలు కచ్చితంగా పాటించాలని అప్పుడే ఎలాంటి ఇబ్బందుల పాలవరని వివరించారు. ఎప్పటికప్పుడు అధికారులు అప్రమత్తమవుతూ సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అల సూచించారు. అలాగే భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య గోదావరి కరకట్ట ప్రాంతం వద్ద విస్తా కాంప్లెక్స్ ఏరియాలో మోటార్ల ద్వారా బ్యాక్ వాటర్ ను తొలగించే ప్రాంతాన్ని పరిశీలించారు. రామాలయం ఏరియాలో కొత్త కాలనీలో వరద నీరు చేరకుండా అధికారులు ఎప్పటికప్పుడు బ్యాక్ వాటర్ ను మోటార్ల ద్వారా తొలగించాలని అధికారులకు సూచించారు. అలాగే ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని అత్యవసం అయితే తప్ప వర్షంలో బయటకు రాకూడదని సూచించారు.

మహబూబాబాద్ లో కూడా పెద్ద ఎత్తున వర్షాలు కురుస్తుండడంతో ఏజెన్సీ గ్రామాల్లోని వాగులు, వంకలన్నీ ఉరకలెత్తుతున్నాయి. కుండపోత వర్షాల కారణంగా రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. జిల్లాలోని కొత్తగూడ మండలంలో కురుస్తున్న భారీ వర్షాలకు చెరువులు, నిండుకుండలా మారాయి. కొత్తపల్లి వైపు వెళ్లే బుర్కపల్లి వాగు పొంగడంతో రహదారిపై వాహనాలు అన్నీ నిలిచిపోయి ట్రాఫిక్ స్తంభించిపోయింది. వేలుబల్లి కతర్ల వాగు సైతం పొంగుతోంది. నర్సంపేట నుంచి కొత్తగూడ వైపు వెళ్లే దారిలో గాదెవాగు గుంజేడుతోగు ఉప్పొంగి ప్రవహిస్తోంది. కొత్తపల్లి మండలంలోని గాంధీ నగర్ లో గత రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు మోదె నరసమ్మ అనే వృద్ధురాలు ఇల్లు కూలిపోవడంతో ఆ కు?ంబం మొత్తం నిరాశ్రయులు అయ్యారు. గూడూరు మండలం కొమ్ముల వంచ శివారులో భీముని పాదం జలపాతం భారీ వర్షాలకు ఉధృతంగా పొంగుతోంది. పర్యాటకులు జలపాత సందర్శనానికి రాకూడదని అటవీ శాఖ అధికారులు హెచ్చరిక బోర్డులు పెట్టారు

# నీటి పారుదల శాఖ అప్రమత్తం

- ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్ కుమార్

**హైదరాబాద్ :** రాష్ట్రంలో ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో రాష్ట్ర నీటి పారుదల శాఖ యంత్రాంగం అప్రమత్తంగా ఉందని రాష్ట్ర నీటిపారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్ కుమార్ తెలిపారు. అత్యధిక వర్షపాతం నమోదు వలన ముఖ్యంగా ఉమ్మడి ఆదిలాబాద్ , వరంగల్ , ఖమ్మం జిల్లాలలో నీటి ప్రాజెక్టులకు వరద నీటి ప్రవాహం పెరుగుతుందని ఆయన తెలిపారు.

రాష్ట్రంలో 19 టెరిటోరియల్ ప్రాంతాలలో చీఫ్ ఇంజనీర్ల ఆధ్వర్యంలో నీటిపారుదల శాఖ ఆపరేషన్ బృందాలు పని చేస్తున్నాయని ఎప్పటికప్పుడు వరద పరిస్థితిని సమీక్షిస్తున్నాయని ఆయన తెలిపారు. కడెం ప్రాజెక్టుకు భారీ ఇన్ ఫ్లో ఉంది. ఈ రోజు ఉదయం తో పోలిస్తే ఇన్ ఫ్లో తగ్గిందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం ఆ ప్రాజెక్టు వద్ద నీటి పారుదల శాఖ అధికారులు, జిల్లా యంత్రాంగం, రాష్ట్ర మంత్రివర్యులు శ్రీ ఎ.ఇంద్రకరణ్ రెడ్డి నేతృత్వంలో పటిష్ట భద్రతా చర్యలు చేపట్టారని ఆయన తెలిపారు.భద్రాచలం వద్ద ప్రస్తుతం రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోందని, భద్రాచలం పట్టణంలో వరద నీటి ప్రవాహం కట్టడి చేయడానికి భారీ మోటార్లు పెట్టి నీటిని తోడేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఎలాంటి ప్రాణానష్టం జరగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. రెండు హెలికాప్టర్లు కూడా సిద్ధంగా ఉంచామని. పోలవరం గేట్లు ఎత్తి ఉంచాలని సంబంధిత ప్రాజెక్టు అధికారులతో నిరంతరం మన రాష్ట్ర నీటి పారుదల శాఖ అధికారులు సంప్రదిస్తున్నారని ఆయన తెలిపారు. మిషన్ కాకతీయ ఫలితాలు ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తున్నాయని రాష్ట్ర వ్యాప్తంగా 46 వేల చెరువులు వర్షపాతంతో జలకళతో నిండి ఉన్నాయని ఇరిగేషన్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రజత్ కుమార్ పేర్కొన్నారు. కేవలం 100 లోపు చెరువులకు మాత్రమే గండ్లు పడ్డాయి వాటిని పూడ్చుతున్నామని స్పెషల్ సీఎస్ రజత్ కుమార్ పేర్కొన్నారు.

# వరదలపై నిరంతర పర్యవేక్షణ

- డీజీపీ అంజనీకుమార్

**హైదరాబాద్** తెలంగాణా లో చీఫ్ సెక్రటరీ ద్వారా ప్రతి జిల్లా నుండి వర్షాలు పై పర్యవేక్షణ చేస్తున్నాం. అడిషనల్ డీజీ లా అండ్ ఆర్డర్, గ్రే హౌండ్స్ , ఇతర అధికారులు డీజీపీ కార్యాలయం నుండి పర్యవేక్షణ చేస్తున్నామని డీజీపీ అంజనీ కుమార్ వెల్లడించారు. 2900 మందిని రెస్క్యూ చేసి, పునరావాస కేంద్రంకు తరలించాం.

మోచన్ పల్లి వరదలకు చిక్కుకున్న వారిని 6 ఎన్డీఆర్ఎఫ్ టీమ్ తో రెస్క్యూ ఆపరేషన్ చేస్తున్నాం. అత్యవరసర సమయాల్లో మాత్రమే పబ్లిక్ బయటకి రావాలి . హైదరాబాద్ మూడు కమిషనరేట్ లలో పరిస్థితి అదుపులో ఉంది . ముసారాం బాగ్ బ్రిడ్జ్ పై వరద నీరు కూడా కంట్రోల్ లో ఉంది. పిల్లలు పై తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి. సెల్ఫీ లు తీసుకోవడానికి వచ్చి ప్రమాదాలకు గురవుతున్నారు. సెల్ఫీ లు తీసుకోవడానికి బయటకి రావొద్దు. విద్యుత్ స్తంభాలపై అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నాం.
24 పాటు డీజీపీ కార్యాలయం లో రాష్ట్ర వ్యాప్తంగా పరిస్థితిని సమీక్షిస్తున్నామని అయన అన్నారు.

ఉన్న విషయ తెలుసుకున్న ముఖ్యమంత్రి కేసీఆర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. గ్రామంలో పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వెంటనే ప్రజలను రక్షించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

### రంగంలోకి హెలిక్యాప్టర్లు.. ఎన్డీఆర్ఎఫ్ బృందాలు

సీఎం ఆదేశాలతో రెండు ఆర్మీ హెలికాప్టర్లను హైదరాబాద్ నుంచి మోరంచపల్లికి బయలుదేరాయి. మోరంచపల్లి సమీపంలో నదిలో చిక్కుకుపోయిన జేసీబీలోని ఆరుగురిని రక్షించేందుకు ఈ హెలికాప్టర్లను పంపారు. మరోవైపు సహాయక చర్యల కోసం ఎన్డీఆర్ఎఫ్, అగ్నిమాపక సిబ్బంది మోరంచపల్లికి చేరుకుంటున్నారు. మోరంచపల్లి సమీపంలోని కుందూరుపల్లికి ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది చేరుకున్నారు. బోట్ల సాయంతో ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది మోరంచపల్లికి చేరుకుంటారు. బోట్ల సాయంతో వరద బాధితులను బయటకు తీసుకువస్తామన్నారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి కూడా గ్రామానికి చేరుకున్నారు. వరద బాధితులకు ఆహారం, మంచినీరు అందిస్తున్నారు. ఈ గ్రామంలో పరిస్థితిని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అడిగి తెలుసుకున్నారు. రెస్క్యూ టీమ్‌లను గ్రామానికి పంపించాలని అధికారులను ఆదేశించారు. హెలికాప్టర్లతో ఆహారం, మంచినీళ్లు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కట్టు బట్టలతో ఇళ్లపై ఉన్నవారిని కాపాడేందుకు ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది, రెస్క్యూ బృందాలు ప్రయత్నాలు చేస్తున్నాయి.

# జమిలికి నో ఛాన్స్

ఎన్నికల విషయమే. కేంద్ర ప్రభుత్వం ఈ అంశంపై పూర్తి స్పష్టతనిచ్చింది. జమిలి ఎన్నికలు నిర్వహించడం కష్టసాధ్యమని పార్లమెంటులో తేల్చి చెప్పింది. దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం సాధ్యంకాని పనని తెలిపింది. కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ పార్లమెంటులో ఈ విషయాన్ని వెల్లడించారు. జమిలి ఎన్నికలపై పలువురు ఎంపీలు అడిగిన ప్రశ్నకు ఆయన లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. జమిలి ఎన్నికలతో లాభాలు ఉన్నప్పటికీ, ఒకేసారి లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ సాధ్యమయ్యే పని కాదని మంత్రి వ్యాఖ్యానించారు. లాభాలు ఎన్ని ఉన్నాయో.. అవరోధాలు కూడా అన్నే ఉన్నాయని, అంతేకాకుండా జమిలి కోసం 5 కీలకమైన రాజ్యాంగ సవరణలు చేయాల్సి ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు దేశవ్యాప్తంగా అన్ని రాజకీయ పార్టీలు ఇందకు సమ్మతించాలి. నిర్వహణకు భారీ సంఖ్యలో ఈవీఎంలు, వీవీప్యాట్ ల అవసరం ఉంటుంది. ఒకేసారి అన్ని చోట్లా భద్రతా బలగాల మోహరింపు సాధ్యం కాదని జమిలిపై న్యాయశాఖ పార్లమెంటరీ స్థాయి సంఘం పరిశీలన చేసింది. సీఈసీ సహా భాగస్వామ్య పక్షాలతో సంప్రదింపులు జరిపింది. దీని తర్వాత విధాన రూపకల్పన జాతీయ లా కమిషన్ పరిశీలనతో ఉందని మంత్రి చెప్పారు. నరేంద్రమోడీ ప్రధానమంత్రి పదవి చేపట్టిన తర్వాత జమిలి ఎన్నికల అంశం చాలాసార్లు చర్చకు వచ్చింది. అయితే వీటి నిర్వహణకు కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు రాలేదు. పదవీకాలాన్ని వదులుకోవడానికి అధికారంలో ఉన్న ఏ రాజకీయ పార్టీ ఇష్టపడలేదు. బీజేపీ అనుకూల ప్రభుత్వాలు రాష్ట్రాలు అంగీకరించాయికానీ.. ఇతర పార్టీలు ముందుకు రాలేదు. కొన్ని సంవత్సరాలుగా విషయం ఇలాగే నానుతుండటంతో కేంద్రం కూడా అడుగు ముందుకు వేయలేకపోయింది.

# అధికారం కోసం వాళ్లు మణిపూర్‌నే కాదు..

## దేశం మొత్తాన్నీ తగులబెడతారు

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు, వయానాడు మాజీ ఎంపీ రాహుల్ గాంధీ అధికార బీజేపీపై విమర్శలు సంధించారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లపై తీవ్ర ఆరోపణలు చేశారు. వారికి కేవలం అధికార యావ తప్ప ప్రజాల బాగోగులు పట్టదని అన్నారు. అధికారం కోసం వారు ఎంతకైనా దిగజారుతారని పేర్కొన్నారు. అధికారం కోసం మణిపూర్‌ను తగులబెడతారని, అవసరమైతే దేశం మొత్తాన్నీ కాల్చేస్తారని అన్నారు. యూత్ కాంగ్రెస్ కార్యక్రమాన్ని ఉద్దేశిస్తూ రాహుల్ గాంధీ వర్చువల్‌గా మాట్లాడారు. ఆయన ప్రసంగంలోని కొంత భాగాన్ని కాంగ్రెస్ ట్విట్టర్‌లో పంచుకుంది. ఆ వీడియోలో ఆయన బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లపై విమర్శలు సంధిస్తున్నారు. వారికి అధికారం తప్ప ప్రజల సంక్షేమం అవసరం లేదని అన్నారు. అధికారం కోసం వారు ఏమైనా చేస్తారని పేర్కొన్నారు. వారు మణిపూర్‌ను తగులబెడతారని అన్నారు. దేశం మొత్తాన్నీ నాశనం చేస్తారని ఆరోపణలు చేశారు. వారు ప్రజల బాధలు, దుఖం పట్టించుకోరని తెలిపారు. అది హర్యానా కానివ్వండి, పంజాబ్, ఉత్తరప్రదేశ్ కానివ్వండి నాశనం చేసేస్తారని అన్నారు. వారు అధికారం కోసం దేన్నైనా అమ్మేస్తారని చెప్పారు.'దేశంలో ఎవరికి బాధ కలిగినా, వారు ఏ ప్రాంతంవారైనా, ఏ మతం వారైనా, ఏ జాతి వారైనా సరే వారికి బాధ కలిగితే మీరు కూడా బాధపడతారు. ఎందుకంటే మీరు దేశ భక్తులు. మీరు భారతీయులు' అని రాహుల్ గాంధీ అన్నారు. 'నేను ఇటు వైపు కూర్చుంటే.. మీరు అటు వైపు కూర్చున్నారు. మనమంతా దేశం అంటే ఎనలేని ప్రేమ కలిగినవారం. ఈ దేశం ఎక్కడ గాయపడినా మనమంతా బాధపడిపోతాం. మన మనసు ఉన్నట్టుండి ఎందుకు బాధపడుతుందో తెలియదు. మూడాఫ్ ఎందుకు అయిందో తెలియదు. దేశ పౌరుడి బాధను మనం అలా లోపలి నుంచి పంచుకుంటాం. కానీ, బీజేపీ, ఆర్ఎస్ఎస్ వాళ్లకు ఈ ప్రేమ ఉండదు. వారు బాధపడరు. ప్రజల బాధలను చూసి వారు కలత చెందరు. ఎందుకంటే వారు దేశాన్ని విభజించే పనిలోనే ఉన్నారు' అని రాహుల్ గాంధీ అన్నారు.

# ప్రాజెక్టుల నిర్మాణంలో కోస్తాకు ద్రోహం

## వైసీపీ సర్కార్ ప్రాజెక్టులకు ఖర్చు పెట్టింది చాలా తక్కువ

తెలుగుదేశం పార్టీ హయాంలో కోస్తాంధ్రలో ప్రాజెక్టుల కోసం రూ. 21, 442 కోట్లు ఖర్చు పెట్టారని కానీ వైసీపీ హయాంలో కేవలం రూ. 4375 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టారన్నారు. ఇది కూడా నిర్వహణ ఖర్చుల కోసమేనని.. నిర్మాణాలన్నీ పడకేశాయన్నారు. ప్రాజెక్టులను అలా వదిలేసి ప్రజాద్రోహం చేశారని మండిపడ్డారు. నాలుగేళ్లలో ప్రాజెక్టుల్లో నాలుగు శాతం పనులే చేయడం సిగ్గు చేటన్నారు. కోస్తాంధ్ర ప్రరిధిలో 96 ప్రాజెక్టుల పనులు టీడీపీ హయాంలో ప్రారంభిస్తే వైసీపీ వచ్చాక వాటన్నింటినీ ప్రి క్లోజర్ చేశారన్నారు.

పోలవరం కుడి కాలువ మట్టిని దోచుకున్నారన్నారు. ఏపీలోని 69 నదులను అనుసంధానం చేయడం ముఖ్యమన్నారు.ఈ అనుసంధాన ప్రక్రియ పూర్తైతే.. నీటి సమస్యే ఉండదని తెలిపారు. ఉత్తరాంధ్రలో వంశధార, నాగావళి ప్రధాన నదులు.. వీటి కింద అనేక నదులు ఉన్నాయన్నారు. ఉత్తరాంధ్రలో నదులను అనుసంధానం చేసేలా ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు చేపట్టామని తెలిపారు. వంశధార – గోదావరి నదులను అనుసంధానం చేయొచ్చు కానీ జగన్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేసిందని మండిపడ్డారు.

### నదుల అనుసంధానం ముఖ్యం

వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయిన రోజు నుంచి రాష్ట్రంలోని ప్రాజెక్టులన్నీ పడకేశాయని చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాజెక్టులకు నిధులు విడుదల చేయకుండా, కమీషన్ల కక్కుర్తితో టెండర్లు పిలిచించి తనకు కావలసిన కాంట్రాక్టర్లకు వందల కోట్ల రూపాయలు చెల్లించారని ఆరోపించారు. ప్రీ క్లోజర్ చేస్తూ, అయిదేళ్లపాటు టెండర్లే పిలవకూడదంటూ జీవో జారీ చేశారన్నారు. ప్రెస్ మీట్ పెడుతున్నానని ప్రాజెక్టులపై సీఎస్ హడావుడి సమీక్ష పెట్టారని తెలిపారు. సీఎం జగన్, మంత్రి లేకుండానే ప్రాజెక్టులపై సమీక్షించారన్నారు. "ఇరిగేషన్ మంత్రి ఉన్నారు కానీ అంబోతులా అరుస్తాడు తప్ప ఏం చేయడు.? కనకపు సింహాసనంపై శునకాన్ని కూర్చొపెట్టినట్టే ఉంది. ఈ ఏడాది చివర్లో ఏదో ఐదు ప్రాజెక్టులు ప్రారంభిస్తారట. ప్రాజెక్టులకు నిధులు కేటాయించకుండా నిర్మాణం ఎలా పూర్తి చేస్తారు.?" అంటూ చంద్రబాబు నాయుడు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రాజెక్టుల నిర్వహణ కూడా చేయలని చెత్త ప్రభుత్వమన్నారు.

### జగన్ కిమ్ బ్రదర్

జగన్ రెడ్డి పేదలకు పెత్తందార్లుకు పోరాటం అంటూ స్లోగనర్లు ఇస్తున్నారని ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తి చేసుంటే పేదలకు మేలు జరిగేది కదా అని ప్రశ్నించారు. స్లోగన్లు వద్దని సలహా ఇచ్చారు. ఓ పక్క దోచుకుంటూ మరో పక్క స్లోగన్లు ఇస్తారా అని ప్రశ్నించారు. ఈ ప్రభుత్వాన్ని శ్వేతపత్రం డిమాండ్ చేసి కూడా అనవసరమన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే ప్రాజెక్టుల నిర్మాణంపై టైమ్ బాండ్ ప్రొగ్రాం పెట్టుకుని పని చేస్తామని ప్రకటించారు. జగన్ రెడ్డి కిమ్ బ్రదర్ అని ప్రజల్ని నవ్వినా కొడతారు ఏడ్చినా కొడతారని సెటైర్ వేశారు. ఇంత కన్నా చెత్తగవర్నమెంట్ ఎక్కడా లేదన్నారు. బటన్ నొక్కితే అమ్మఒడి వెళ్తోందా అని ప్రశ్నించారు. రూ. పదహేను వేలన్నారు..తర్వాత రూ. 13 వేలు ఇస్తున్నామంటూ బటన్ నొక్కి రూ. 5 వేలు వేస్తారా.? అని ప్రశ్నించారు. జగన్ను నొక్కేది ఉత్తుత్తి బటనే. అసలు బటన్ సాయంత్రం తాడేపల్లి ప్యాలెస్సులో నొక్కుతాడని మండిపడ్డారు.

# వరదముంపులో మూడు గ్రామాలు

ములుగు (ప్రశ్న న్యూస్) ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో తెలంగాణ అతలాకుతలమవుతోంది. వరదలు పోటెత్తడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాగులు, వంకలు పొంగిపొర్లుతుండటంతో వరదల్లో పలువురు గల్లంతయ్యారు. ములుగు జిల్లా ఏటూరు నాగారం కొండాయి గ్రామంలో సుమారు వంద మంది వరదల్లో చిక్కుకున్నారు. ఆరుగురు గల్లైంతనట్లు తెలిసింది. ఈ మేరకు ములుగ్ను ఎమ్మెల్యే సీతక్క వారిని రక్షించేందుకు హెలికాప్టర్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని వేడుకున్నారు. కొండాయి గ్రామమంతా నీట మునిగిందని.. కొందరు గ్రామ పంచాయితీ భవనం ఎక్కి సహాయం కోసం ఎదురు చూస్తున్నారని వారిని కాపాడాలని సీతక్క మీడియా ఎదుట కన్నీరు పెట్టుకున్నారు. "మాకో హెలికాప్టర్ ఇవ్వండని చెబుతూనే ఉన్నాం. ఇప్పటి వరకు ఎంత మంది ఉన్నరో ఎంతమంది పోయారో తెలియదు. మంత్రి కేటీఆర్ గారి కోసం మేం ట్రైం చేశాం. మంత్రి సత్యవతి రాథోడ్‌తోనూ మాట్లాడినం. వాగు దాటకం రెస్క్యూ టీం వాళ్ల కావటంలేదు. ఎన్టీఆర్ఎఫ్ బృందాలు వెనక్కి వచ్చేశాయి. ఒక హెలికాప్టర్ ఇచ్చివారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కోరుతున్నాం. అటు మూడు గ్రామాల ప్రజలు ఉన్నారు. ముఖ్యంగా వంద మంది చాలా డేంజర్‌లో ఉన్నరు. ఆరుగురు కొట్టుకుపోయినట్లు తెలిసింది.ఇప్పటికైనా యుద్ధప్రతిపాదికన ఈ ప్రాంత ప్రజలను కాపాడటం కోసం హెలికాప్టర్‌ను ఇవ్వాలి. ఈ ఊర్ల చూట్టూ చెరువులు, వాగులే ఉన్నయ్. ఇప్పటికే పలు గ్రామాల్లో కుటుంబాలు కొట్టుకుపోయినయ్. ఇప్పుడు ఏటూరు నాగారం కొండాయిలో ఆరుగురు కొట్టుకుపోయారు. మరో వంద మంది ప్రమాదంలో ఉన్నరు. చుట్టూ వాగులే ఉన్నయ్. వాళ్లు ఎటూ రాలేని పరిస్థితి. ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించి ములుగు ప్రాంతాలనికి ప్రత్యేకంగా హెలికాప్టర్ ఏర్పాటు చేయాలి. ఆ ప్రాంత ప్రజలను కాపాడాలని చేతులెత్తి మ్నెక్కుతున్నా." అని సీతక్క కన్నీరు పెట్టుకున్నారు. అంతకు ముందు ములుగు నియోజకవర్గంలోని వరద ప్రభావిత ప్రాంతాలను ఆమె సందర్శించారు. నడుము లోతు వరద నీటిలో నడిచి బాధితులను పరామర్శించారు. ప్రజలతో మమేకమై వారి కష్టాలను తెలుసుకున్నారు. బాధితులకు ఆహారం, నీరు వంటి అవసరమైన సామాగ్రిని పంపిణీ చేశారు.

# క్విట్ 'ఇండియా'

వేసుకుని, గతంలో యూపీఏ హయాంలో తాము చేసిన ఘన కార్యాలయాలను కప్పిపుచ్చుకునేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. వారు నిజంగా భారతదేశం పట్ల శ్రద్ధ ఉన్నవారైతే, మన వ్యహారాల్లో జోక్యం చేసుకోవాలని విదేశీయులను కోరతారా? అని ప్రశ్నించారు. "క్విట్ ఇండియా అన్నది మహాత్మాగాంధీ నినాదం. అవినీతిపరులు, బుజ్జగింపు రాజకీయాలు చేసేవారు, మందీమార్బలంతో రాజకీయాలు చేయాలనుకునేవారు దేశం విడిచిపోవాలంటే మేం ఇవాళ క్విట్ 'ఇండియా' అంటున్నాం. గతంలో మాజీ ప్రధాని ఇందిరా గాంధీ ఇండియా అంటే ఇందిరానే, ఇందిరా అంటే ఇండియానే అని ప్రచారం చేసుకున్నారు కానీ ప్రజలు ఆమెను ఓడించారు. ఇప్పుడీ అహంకారులు మరోసారి అలాంటి నినాదమే చేస్తున్నారు. కాంగ్రెస్ ఒక దశాదిశ లేని పార్టీ. కుంభకోణాల్లో చిక్కుకున్న కంపెనీలు ఎలా పేర్లు మార్చుకున్నాయో, కాంగ్రెస్ పార్టీ మిత్ర పక్షాలు కూడా అలాగే కొత్త పేర్లతో వస్తున్నాయి" అంటూ మోదీ ధ్వజమెత్తారు.

# ఇంద్రకరణ్ రెడ్డికి నిరసన సెగ

ఆయన సమీక్షించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన శిబిరాలకు ప్రజలని తరలించారు. వారిని పరామర్శిచేందుకు వచ్చిన మంత్రి ఇంద్రకరణ్ రెడ్డిపై కడెం వాసులు ఆగ్రహం వ్యక్తం చేసారు. గత ఏడాది వచ్చిన వరదలకే కడెం ప్రాజెక్టు గేట్లు పాడైనట్టు చెబుతున్నారు. ఏడాది కాలంగా గేట్లు మరమ్మతులు చేయించలేదు ఎందుకని ప్రశ్నించారు. మంత్రిని ఘొరావ్ చేసిన స్థానికులు తమ సమస్యపై నిలదీశారు. ఆయనతోపాటు ఎమ్మెల్యే రేఖానాయక్‌ను కూడా ప్రశ్నించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన శిబిరాల్లో కూడా వసతులు సరిగా లేవని కడెం వాసులు మండిపడ్డారు. భోజనం కూడా ఇవ్వడం లేదని ఫైర్ అయ్యారు. ప్రాజెక్టుకు మరమ్మతులు చేసి ఉంటే తాము ఇలా వరదల్లో చిక్కుకోవాల్సిన దుస్థితి వచ్చేది కాదని ఆగ్రహం వ్యక్తం చేసారు.

# హైదరాబాద్-విజయవాడ హైవే బంద్

వాహనదారులు ఈ కింద తెలిపిన మార్గాల ద్వారా ప్రయాణించాలని సూచించారు. హైదరాబాద్ నార్కెట్ పల్లి మిర్యాలగూడ దాచేపల్లి పిడుగురాళ్ల- సత్తెనపల్లి గుంటూరు విజయవాడ ఏలూరు రాజమండ్రి విశాఖపట్నంకు వెళ్ళాలి. విశాఖపట్నం- రాజమండ్రి- ఏలూరు విజయవాడ గుంటూరు సత్తెనపల్లి పిడుగురాళ్ళ దాచేపల్లి మిర్యాలగూడ నార్కెట్ పల్లి హైదరాబాద్ కు వెళ్ళాలి వాహనాదారులు తమ ప్రయాణాలను ఈ కొత్త మార్గాల ద్వారా మార్చుకోవాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. ప్రజలు, వాహనదారులు పోలీస్ శాఖ వారికి సహకరించాలని కోరారు. ఏదైనా సమాచారం కోసం పోలీస్ కంట్రోల్ రూం నెంబర్ 7328909090 కు సంప్రదించాలని సూచించారు.

# కర్నాటక ఫార్ములా పక్క రాష్ట్రాలలో ఫలించేనా.?

అందిపుచ్చుకోవాలనే ఆలోచనతో ఉందని సమాచారం. మధ్యప్రదేశ్ లో కాంగ్రెస్ ను గెలిపిస్తే రైతులకు ఉచిత విద్యుత్ ఇస్తామని, అలాగే వ్యవసాయ రుణాలను పెండింగ్ విద్యుత్ ఛార్జీలను మాఫీ చేస్తామని ప్రకటించింది. ఈ మేరకు హోం శాఖ సహాయ మంత్రి కమల్ నాథ్ ఈ హామీలను ప్రకటిస్తు బీజేపి పాలనలో రైతులపై రుణభారం పెరిగిపోయిందని, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ 70% వ్యవసాయ ఆధారితమైనదని, 2018 ఎన్నికల తరువాత ప్రభుత్వం ఏర్పాటు చేశాక తాము 27 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేశామని ప్రకటించారు. ఈ సందర్భంగా ప్రధానంగా ఐదు హామీలను ప్రకటించారు.కృషక్ న్యాయ యువజన ద్వారా రైతులకు ఇన్ పుట్ ధరను తగ్గిస్తామని, వ్యవసాయానికి ఉపయోగించే పంపులకు 5 హార్స్ పవర్ లోపు వాటికిప అదనంగా రైతులకు నిరంతరాయంగా 12:00 గంటల ఉచిత విద్యుత్ అందేలా చేస్తామని, వ్యవసాయ రుణాలను మాఫీ చేస్తామని, రైతులు నిరసన తెలిపిన సమయంలో వారిపై పెట్టిన కేసులను ఎత్తివేస్తామని వ్యవసాయం కోసం రైతులు వాడిన విద్యుత్ పెండింగ్ బిల్లులను మాఫీ చేస్తాం అని ప్రకటించారు. ఇక త్వరలో జరగబోయే తెలంగాణ ఎన్నికల్లోను కర్ణాటక, మధ్యప్రదేశ్ లో ఇచ్చిన ఐదు హామీలను కాంగ్రెస్ ప్రకటించబోతోందని సమాచారం. ఆయా రాష్ట్రాల్లో అవసరాలకు అనుగుణంగా ఐదు హామీల్లో చిన్న చిన్న మార్పులు చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే తెలంగాణకు కాంగ్రెస్ అనేక హామీలను ప్రకటించింది. గతంలో పోలిస్తే తెలంగాణాలో కాంగ్రెస్ బాగా బలపడిందని గట్టిగా నమ్ముతోంది . ఇటీవల పెరిగిన చేరికలు జోరు అందుకోవడంతో పాటు, కర్ణాటక ఎన్నికల్లో ఇచ్చిన ఉచిత హామీలు వర్కౌట్ అవ్వడంతో ఈ ప్రభావం తెలంగాణ లోను కనిపించడం, గతంతో పోలిస్తే కాంగ్రెస్ పై జనాల్లో ఆదరణ పెరగడం , బీఆర్ఎస్ ప్రభుత్వంపైనా, బేజేపి పైన పెరుగుతున్న వ్యతిరేకత ఇవన్నీ తమకు కలిసి వస్తాయని కాంగ్రెస్ అంచనా వేస్తోంది. ఏది ఏమైనా వరుసగా జరిగే వివిధ రాష్ట్రాల్లోని ఎన్నికల్లో కాంగ్రెస్ పాగా వేసే విధంగా వ్యూహాతకంగా నిర్ణయాలు తీసుకుంటు, ప్రజల నాడికి అనుగుణంగా హామీలను ఇస్తూ ఎన్నికల్లో పై చేయి సాధించే విధంగా ప్రయత్నాలు చేస్తోంది. మరి ఈ హామీల పరంపర గట్టెక్కించేనా

# జమిలికి నో ఛాన్స్

ఎన్నికల విషయమే. కేంద్ర ప్రభుత్వం ఈ అంశంపై పూర్తి స్పష్టతనిచ్చింది. జమిలి ఎన్నికలు నిర్వహించడం కష్టసాధ్యమని పార్లమెంటులో తేల్చి చెప్పింది. దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం సాధ్యంకాని పనని తెలిపింది. కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ పార్లమెంటులో ఈ విషయాన్ని వెల్లడించారు. జమిలి ఎన్నికలపై పలువురు ఎంపీలు అడిగిన ప్రశ్నకు ఆయన లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. జమిలి ఎన్నికలతో లాభాలు ఉన్నప్పటికీ, ఒకేసారి లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ సాధ్యమయ్యే పని కాదని మంత్రి వ్యాఖ్యానించారు. లాభాలు ఎన్ని ఉన్నాయో.. అవరోధాలు కూడా అన్నే ఉన్నాయని, అంతేకాకుండా జమిలి కోసం 5 కీలకమైన రాజ్యాంగ సవరణలు చేయాల్సి ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు దేశవ్యాప్తంగా అన్ని రాజకీయ పార్టీలు ఇందకు సమ్మతించాలి. నిర్వహణకు భారీ సంఖ్యలో ఈవీఎంలు, వీవీప్యాట్ ల అవసరం ఉంటుంది. ఒకేసారి అన్ని చోట్లా భద్రతా బలగాల మోహరింపు సాధ్యం కాదని జమిలిపై న్యాయశాఖ పార్లమెంటరీ స్థాయి సంఘం పరిశీలన చేసింది. సీఈసీ సహా భాగస్వామ్య పక్షాలతో సంప్రదింపులు జరిపింది. దీని తర్వాత విధాన రూపకల్పన జాతీయ లా కమిషన్ పరిశీలనతో ఉందని మంత్రి చెప్పారు. నరేంద్రమోడీ ప్రధానమంత్రి పదవి చేపట్టిన తర్వాత జమిలి ఎన్నికల అంశం చాలాసార్లు చర్చకు వచ్చింది. అయితే వీటి నిర్వహణకు కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు రాలేదు. పదవీకాలాన్ని వదులుకోవడానికి అధికారంలో ఉన్న ఏ రాజకీయ పార్టీ ఇష్టపడలేదు. బీజేపీ అనుకూల ప్రభుత్వాలు రాష్ట్రాలు అంగీకరించాయికానీ.. ఇతర పార్టీలు ముందుకు రాలేదు. కొన్ని సంవత్సరాలుగా విషయం ఇలాగే నానుతుండటంతో కేంద్రం కూడా అడుగు ముందుకు వేయలేకపోయింది.

# మరో రెండు రోజులు వానలే వానలు

**హైదరాబాద్ :** రాష్ట్రంలో రానున్న రెండు రోజుల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశమున్నందున రాష్ట్రంలోని పోలీస్ యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామని డీజీపీ అంజనీ కుమార్ తెలిపారు. రానున్న 48 గంటలలో రాష్టంలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో చేపట్టాల్సిన ముందుజాగ్రత్త చర్యలపై పోలీస్ కమిషనర్లు, ఎస్. పి లతో బుధవారం రాత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. శాంతి భద్రతల విభాగం అదనపు డీజీ సంజయ్ కుమార్ జైన్ కూడా పాల్గొన్న ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీజీపీ అంజనీ కుమార్ మాట్లాడుతూ? పోలీస్ యంత్రాంగం 24గంటలు అందుబాటులో ఉంటారని సహాయం కోసం డయల్100 కి లేదా స్థానిక పోలీసు పోలీసులకు గానీ సమాచారం అందిన వెంటనే తగు సహాయక చర్యలు చేపట్టడం జరుగుతుందని స్పష్టం చేశారు.గురువారం దాదాపుగా 8 జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది, రెడ్ అలర్ట్ ప్రకటించారని, అలాగే గురువారం కొన్ని ఈశాన్య, తూర్పు తెలంగాణతో పాటు పశ్చిమ తెలంగాణలోని జిల్లాలకు కూడా రెడ్ అలర్ట్ ఉందని తెలిపారు. హైదరాబాద్‌లో ఈ రెండు రోజుల పాటు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అన్నారు. ఇప్పటికే గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల పలు ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు పూర్తిగా నిండాయని, ఈ జలాశయాల వద్దకు ఎవరు వెళ్లకుండా తగు ముందు జాగ్రత చర్యలు చేపట్టాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. వరద ఉదృతితో తెగిపోయిన రోడ్లు, ఉదృతంగా ప్రవహించే కాజ్‌వేల వద్దకు ప్రజలు వెళ్లకుండా, రెండు దిక్కులా ప్లాస్టిక్ కోన్స్, బారిగేడ్స్, హెచ్చరిక గల ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్తగా ట్రాఫిక్ డైవర్షన్ చేయాలని ఆదేశించారు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో చర్లలోని లోతట్టు ప్రాంతాలలోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించామన్నారు.పరిస్థితుల్లో ఎన్డీఆర్ఎఫ్ బృందాలను ఉపయోగించుకోవాలని అన్నారు. రైతులు పొలాల్లో విద్యుత్ మోటార్ల వద్ద జాగ్రత్తగా ఉండాలి, వర్షాలు పడేటప్పుడు విద్యుత్ స్తంభాలను గాని, వైర్లను గానీ చేతులతో తాకకుండా, ఇతర జాగ్రత చర్యలపై సమాచార మాధ్యమాల ద్వారా ప్రజలను చైతన్య పర్చాలని ఆదేశించారు. వర్షాలకు కల్వర్టు, చిన్న చిన్న బ్రిడ్జిల వద్ద నీరు ప్రవహిస్తున్నప్పుడు వాహనాలతో దాటడానికి సాహసం చేయరాదు అని సూచించారు. జలపాతాలు , నిండిన చెరువుల మత్తళ్ల వద్దకు ప్రజలు వెళ్లకుండా జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు.

# పరీక్షలు, కౌన్సెలింగ్ వాయిదా

**హైదరాబాద్ :** రాష్ట్రవ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానల ధాటికి విద్యా సంస్థలకు ప్రభుత్వం వరుసగా సెలవులు ప్రకటించిన సంగతి తెలిసిందే. వర్షాల మూలంగా వారం రోజులుగా సెలవులు ప్రకటించడంతో వీటి ప్రభావం పరీక్షల నిర్వహణపై పడుతోంది. వర్షాలు తగ్గి, సాధారణ పరిస్థితులు నెలకొనే వరకు పరీక్షలన్నింటినీ వాయిదా వేయాలని విద్యాశాఖ ఉన్నతాధికారులు వర్సిటీలు, విద్యా సంస్థలకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఇప్పటికే ఓయూ, జేఎన్టీయూ, తెలుగు యూనివర్సిటీల్లో ఇంటర్నల్ పరీక్షలతోపాటు ఎంట్రన్స్ టెస్ట్‌లు సైతం వాయిదా పడ్డాయి. డిగ్రీ ప్రవేశాల తేదీల్లోనూ మార్పులు చేశారు. దీంతో డిగ్రీ, ఇంజనీరింగ్ పరీక్షలు మరింత ఆలస్యం కానున్నాయి. పాఠశాలల్లో జూలైలో జరగాల్సిన ఫార్మేటివ్ అసెస్‌మెంట్ (ఎఫ్ఏ?1) పరీక్షలనూ వాయిదా వేయాలని అధికారులు భావిస్తున్నారు.ఇక ఇంటర్ ఫస్టియర్ ప్రవేశాల గడువును జులై 25 నుంచి నెలాఖరు వరకు పొడిగిస్తున్నట్లు ఇంటర్ బోర్డ్ ప్రకటించింది. డిగ్రీ ప్రవేశాల కోసం నిర్వహించే దోస్త్ కౌన్సెలింగ్ సెల్ఫ్ రిపోర్టింగ్ తేదీని జులై 28 వరకూ పొడిగించారు. ఇక ఎంసెట్ రెండో దశ కౌన్సెలింగ్‌కు ఆప్షన్ల గడువు 27తో ముగియనుండగా ఈ నెల 31న సీట్ల కేటాయింపు ఉంటుందని సాంకేతిక విద్య కమిషనరేట్ తెలిపింది. అప్పటికి వర్షాలు తగ్గకపోతే రెండో విడత చేరికల తేదీని పొడిగించాలని అధికారులు భావిస్తున్నారు.

# కర్రీ కోసం వర్రీ

## టమాటా కోసం కిలోమీటర్ క్యూ

**విజయవాడ** వంటింటి రుచుల్లో పెనవేసుకుపోయిన.. టమాటా ఇంకా ధర దిగి రావడం లేదు. డిమాండ్ భారీగా పెరగడం ఆపై సప్లై లేకపోవడంతో.. ధర భారీగా పెరిగి కొండెక్కి కూర్చుంది. రైతు బజార్లలోని సాధారణ కౌంటర్లలో కిలో 110 రూపాయలు ధర పలుకుతుంటే.. బహిరంగ మార్కెట్లలో దాని ధర 130 నుంచి 150 రూపాయలు. మరి ఏపీలో ప్రజల టమోటా కష్టాలను దృష్టిలో పెట్టుకొని రాయితీపై పంపిణీ చేస్తుంది ప్రభుత్వం. కిలో 50 రూపాయలకే పంపిణీ చేస్తున్నడంతో.. పరిమితంగా ఉన్న టమోటాలను కొనుగోలు చేసేందుకు క్యూ కడుతూనే ఉన్నారు జనం.రైతు బజార్లలో రాయితీ టమోటా వస్తుండడంతో.. జనం వాటి కోసం ఎగబడుతున్నారు. తెల్లవారుజాము నుంచి మిగతా కూరగాయల మాటేమో గానీ టమాటా కోసం క్యూ కడుతున్నారు. ఒక్కో కుటుంబంలో ఇద్దరిసి ముగ్గురు చొప్పున కూడా వచ్చి లైన్లో నిలుచుని ఎదురుచూస్తున్నారంటే.. టమాటాకి ఏ మేర డిమాండ్ ఉందో అర్థం చేసుకోవచ్చు. బహిరంగ మార్కెట్లో టమాటా ధర భారీగా పెరగడం.. రాయితీపై టమాటా కిలో 50 రూపాయలకే ఇస్తున్న నేపథ్యంలో.. ఆయా కౌంటర్ల వద్ద జనం బారులు తీరుతున్నారు. ఆధార్ కార్డు తీసుకొస్తే ఒక్కొక్కరికి ఒక్కో కిలో మాత్రమే టమాటా రాయితీపై ఇస్తున్నారు. దీంతో రైతు బజార్లలో టమాటా కోసం క్యూ లైన్ తప్పడం లేదు. నరసింహ నగర్ రైతు బజార్ లో.. రెండు కౌంటర్లలోనూ దాదాపు కిలోమీటర్ వరకు క్యూ లైన్ కనిపిస్తుంది. రైతు బజార్ లోపల కౌంటర్ నుంచి.. ఆ లైన్ కాస్త రోడ్డు పైకి వచ్చేసింది. ఒక్కో లైన్ లో మూడు నుంచి 500 మంది వరకు.. జనం నిల్చుని కాపు కాస్తున్నారు. దీంతో కిలో టమాట పొందాలంటే రెండు గంటల వరకు సమయం పడుతుందని అంటున్నారు వినియోగదారులు.విశాఖ నగరంలో 13 రైతు బజార్లున్నాయి. రైతులు హోల్ సేల్ బజార్ నుంచి ఆయా రైతు బజార్లకు కూరగాయలు నిత్యం తరలించి అమ్ముతూ ఉంటారు. బయట మార్కెట్లో టమాటా పై భారీ ధర ఉండడం.. డిమాండ్ కూడా ఎక్కువ ఉన్న నేపథ్యంలోని ప్రభుత్వం 50 రూపాయలకే రాయితీపై కిలో టమాటా అందుబాటులో పెట్టింది.

కిలో 50చొప్పున విక్రయించే ఏర్పాట్లు జరిగాయి. అయితే టమాటో సప్లై సరిగా లేక రోజూ ఈ రాయితీ టమాటో సప్లై చేయలేని పరిస్థితి. దీంతో డిమాండ్ భారీగా పెరిగిపోతుంది సప్లై తగ్గుతుంది. విశాఖ నగరంలోని రైతు బజార్లకు.. ఒక్కో ట్రిప్పులో సరుకు లభ్యతను బట్టి దాదాపు 7 నుంచి 800 వరకు బాక్సులు రాయితీ పై టమాటా పంపిస్తున్నారు. సీతమ్మధార, ఎంవిపి కాలనీ లాంటి పెద్ద రైతు బజార్లకు డిమాండ్ ఎక్కువగా ఉన్న నేపథ్యంలో.. ఒక్కో రైతు బజారుకు 100 బాక్సుల చొప్పున టమాటో పంపుతున్నారు. మిగతా రైతు బజార్లకు సరుకులభ్యతను బట్టి 40 నుంచి 60 బాక్సుల చొప్పున అందుబాటులో పెడుతున్నారు. కిలో 50 కే వేస్తుండడంతో రాయితీ టమోటా కు అంతలా డిమాండ్ పెరిగిపోయింది.రాయితీపై టమాటా కిలో 50 కే లభిస్తునడంతో.. ఒక్కొక్కరు ఒక్కో ఐడియా సృష్టించుకుంటున్నారు. కొందరు తమ బంధుమిత్రులను కూడా తోడు తీసుకెళ్లి క్యూలో నిలిచబడుతుంటే.. మరికొందరు ఏకంగా ఫ్యామిలీ అంతా టమోటా కోసం క్యూ కట్టేస్తున్నారు. అదేమంటే.. టమాటా రుచి కావాలంటే ఈ మాత్రం కష్టం తప్పదని అంటున్నారు. మరి కొంతమంది అయితే.. సినిమా టికెట్ల కోసం రేషన్ సరుకుల కోసం .. క్యూలైన్లులో ఎదురు చూసినట్లు టమోటో రుచి కోసం ఆ మాత్రం చేయలేమా అంటున్నారు కూడా..విశాఖలో రాయితీ టమాటా కోసం వినియోగదారుల వర్రీ. గంటల తరబడి క్యూలైన్ కాసి మరి కిలో టమోటా తో ఇంటికి వెళ్తున్నారు. అయితే.. టమాటా బ్లాక్ మార్కెట్కు తరలిపోకుండా ఉంటే కాస్త సాధారణ పరిస్థితిలో రావచ్చేమోనని అభిప్రాయం వ్యక్తం అవుతుంది. ఎందుకంటే.. సాధారణ మార్కెట్లలో ధర ఎక్కువ చెల్లిస్తే ఈజీగా లభించే టమాటా.. మరి రాయితీపై ఎందుకు అంత రాదనేది కొందరి మాట..! ఏదేమైనా మళ్లీ సాధరణ పరిస్థితుల్లో రావాలంటే మరి కొంతకాలం వేచి చూడాల్సిందేనట..!

# తెలంగాణ రికార్డ్ స్థాయిలో భారీ వర్షాలు

**హైదరాబాద్** రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురిసాయి. మునుపెన్నడూ లేని రీతిలో తెలంగాణాలో రికార్డు స్థాయిలో వర్షపాతం నమోదు అయింది. తెలంగాణ చరిత్రలో అత్యంత భారీ వర్షపాతాలు నమోదు అవుతున్నాయి. ములుగు జిల్లా వాజేడులో గత 2013 జులై 19 తరవాత తిరిగి గడచిన 24 గంటలలో 51.5 సెం. మీల వర్షం పడింది. గత 24 గంటలలో ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం లక్ష్మీదేవిపేటలో 64 సెం. మీల వర్షం పడింది. గత 24 గంటలలో రాష్ట్రంలోని 35 ప్రాంతాల్లో 20 సెం.మీ పైన వర్షపాతం నమోదు. 200ల కేంద్రాల్లో 10 సెం. మీల పైగా వర్షం కురిసింది. మొన్న నిజామాబాద్ జిల్లాలో 45 సెం. మీల వర్షపాతం నమోదయ్యింది.

# జల దిగ్బంధనంలో మోరంచపల్లె

### - మరొకరు గల్లంతు

**భూపాలపల్లి** భూపాలపల్లి జిల్లాలో వరద ప్రవాహంలో ఇప్పటికే ముగ్గురు గ్రామస్థులు కొట్టుకుపోగా, తాజాగా మరో మహిళ గల్లంతు అయ్యింది. ఇప్పటికే ఎన్డీఆర్ఎఫ్ రెస్క్యూ టీమ్స్ గ్రామానికి బయల్దేరాయి.

అధికారులు ములుగు నుంచి బోట్లు తెప్పిస్తున్నారు. నీట మునిగిన మోరంచపల్లె గ్రామ ప్రాంతాల్లో ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పర్యటించారు.




# వరుణ్ తేజ్ కొత్త సినిమా మట్కా

వరుణ్ తేజ్ 14వ సినిమా గురువారం అట్టహాసంగా పూజా కార్యక్రమాలతో మొదలైంది. ఈ సినిమాకి 'పలాస' సినిమాకి దర్శకత్వం చేసి మంచి పేరు తెచ్చుకున్న కరుణ కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. అలాగే మోహన్ చెరుకూరి, డాక్టర్ విజేందర్ రెడ్డి తీగల ఈ సినిమాని భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నారని తెలిసింది. ఈ సినిమాకి 'మట్కా' అనే టైటిల్ కూడా ఖరారు చేశారు చిత్ర నిర్వాహకులు. ఈ సినిమా కథ ఒక పీరియడ్ డ్రామాగా ఉంటుందని ముందే చెప్పారు. విశాఖపట్నం నేపథ్యంలో సాగే కథ ఇది అని అందుకని, విశాఖపట్నంలో కూడా షూటింగ్ జరపబోతున్నట్టుగా కూడా తెలిసింది. ముహూర్త సన్నివేశానికి పరిశ్రమకి చెందిన అతిరథ మహారథులు అందరూ విచ్చేసి ఈ సినిమా నిర్మాతలకి, కథానాయకుడికి, అలాగే దర్శకుడికి తమ శుభాకాంక్షురాలు చెప్పారు. అగ్ర నిర్మాత అల్లు అరవింద్ , నిర్మాత దిల్ రాజు, అలాగే దర్శకులు హరీష్ శంకర్ , మారుతీ, ఈమధ్యనే 'బేబీ' అనే చిన్న సినిమాతో చాలా పెద్ద విజయం నమోదు చేసుకున్న ఆ సినిమా నిర్మాత, ఇంకో అగ్ర నిర్మాత సురేష్ బాబు ఈ పూజ కార్యక్రమానికి విచ్చేసి కొత్త సినిమా నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే వరుణ్ తేజ్ చెల్లెలు నిహారిక కొణిదెల కూడా వచ్చి పూజా కార్యక్రమంలో పాల్గొంది.

# బేబీ సినిమాకు నో చెప్పిన విశ్వక్ సేన్ ?



బాక్సాఫీస్ దగ్గర కోట్లు కుమ్మరిస్తున్న బేబీ సినిమాలో మొదట హీరోగా ఫలానా నటుడిని అప్రోచ్ అయితే కథ వినకుండానే ఆయన నో చెప్పాడని సాయి రాజేష్ ఓ సందర్భంలో సంచలన కామెంట్స్ చేశాడు. అయితే ఆ ఫలానా హీరో విశ్వక్ సేనే అని రాజేష్ ఎక్కడ ప్రస్తావించలేదు. కానీ పలువురు నెటీజన్‌లు ఆ నటుడు విశ్వక్ సేన్ అని అపాదించేశారు. ఇక దానికి ఆజ్యం పోస్తూ నో అంటే నో అని మగాళ్లకు వర్తిస్తుందని విశ్వక్ చేసిన ట్వీట్ మామాలు వైరల్ కాలేదు. దాంతో బేబి ఆఫర్ మొదట వచ్చింది విశ్వక్‌కే అని అందరూ ఫిక్సయిపోయారు. ఇక ఈ కాంట్రవర్సీపై తాజాగా విశ్వక్ స్పందించాడు. పేక మేడలు టీజర్ లాంచ్ ఈవెంట్‌లో విశ్వక్ చేసిన కామెంట్స్‌పై కొత్త చర్చలకు దారి తీశాయి. ఏదైనా సినిమా ఒప్పుకోవడం నో చెప్పడం తన స్వేచ్ఛని, అంత మాత్రాన బురద జల్లాల్సిన అవసరం లేదని విశ్వక్ అన్నాడు. ఒక చిన్న సినిమా పెద్ద విజయం సాధించినప్పుడు సంతోషపడే వాళ్ళలో తాను ముందుంటానని, ఆ సినిమా ట్రైలర్ రిలీజయ్యాక బాగుందని డైరెక్టర్ల వాట్స్ అప్ గ్రూప్‌లో మొదట మేసేజ్ పెట్టింది తనేనని చెప్పుకొచ్చాడు. ఏ నటుడైనా ఎవరి స్థాయిని బట్టి వారు బిజీగా ఉంటారని, అప్పుడు కలవలేం, కథ వినలేం అని దర్శకుడికి చెబుతుంటామని విశ్వక్ చెప్పాడు. దానికి కొంతమంది ఫీలవుతుంటారు. ఆ విషయంలో నేనేం చేయలేను. అందరినీ ఆనందంగా ఉంచేందుకు నేను బిర్యానీని కాదు. ఒకరి సమయం వృథా చేయడం ఇష్టం లేకనే నా నోటి నుంచి అప్పుడు ఆ సమాధానం వచ్చింది. మన సినిమా విజయవంతమైతే తలెత్తుకోవడంలో తప్పులేదు. కానీ, సినిమా బాగుందని ఎదుటివారిని కించపరచొద్దు. అదొక్కటి బాధగా ఉందంటూ విశ్వక్ తెలిపాడు. ప్రస్తుతం విశ్వక్ చేసిన కామెంట్స్ తెగ వైరల్ అవుతున్నాయి. నిజానికి ఆనంద్ చేసిన పాత్ర విశ్వక్‌కు ఏ మాత్రం సెట్ అవకపోతుండేనని చాలా మంది అభిప్రాయం.

# డాన్ షేడ్‌లో రామ్‌గోపాల్ వర్మ మూవీ



అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అద్భుతాలు అన్నీఇన్నీ కావు. నేటి తరం టెక్ ప్రపంచంలో విపరీతంగా వినిపిస్తున్న పదం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ .ఏఐ టూల్స్‌తో రచయితలు అలవోకగా బుక్స్ రాస్తుండగా ఆర్టిస్టులు సైతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో తమ నైపుణ్యాలకు అద్భుత క్రియేటివిటీ జోడిస్తున్నారు. తాజాగా ప్రముఖ వివాదాస్పద దర్శకుడు రామ్ గోపాల్ వర్మ కూడా తన ఏఐ చిత్రాన్ని పంచుకున్నారు. నేటి తరం టెక్ ప్రపంచంలో విపరీతంగా వినిపిస్తున్న పదం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్.ఇది సాంకేతిక రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది.

టెక్ రంగంలోనే కాదు.. ఆర్టిస్ట్‌ల ఊహా శక్తికీ కూడా ఏఐ రెక్కలు తొడుగుతోంది. ఐ టూల్స్‌తో రచయితలు అలవోకగా బుక్స్ రాస్తుండగా ఆర్టిస్టులు సైతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో తమ నైపుణ్యాలకు అద్భుత క్రియేటివిటీ జోడిస్తున్నారు. మిడ్‌జర్నీ వంటి యాప్‌లను ఉపయోగిస్తూ ఇప్పటివరకూ మన ఊహకు సైతం అందని ఇమేజ్‌లను జనరేట్ చేస్తున్నారు. డాన్ గెటప్‌లో ఉన్న రామ్ గోపాల్ వర్మ.. బ్లాక్ షేడ్స్ గాగుల్స్ పెట్టుకుని సిగార్‌తో రా అండ్ రస్టిక్ లుక్‌లో కనిపించాడు. 'ఐ గాట్ ఏఐ'డీ' అంటూ ట్విట్టర్‌లో రాసుకోచ్చారు. అయితే ఈ ఫోటో డిజైన్ చేసిన ఏఐ ఆర్టిస్ట్ ఎవరో వర్మ వెల్లడించలేదు. ప్రస్తుతం ఆయన షేర్ చేసిన ఫోటో వైరల్ గా మారింది.

# బేబీ మూవీకి తగ్గని ఆదరణ

## - అర్జున్ రెడ్డి, కెజిఎఫ్-2 లను మించి కలెక్షన్లు




ఒకపక్క వర్షాలు, వరదలు, పట్టణాలలోకి కూడా వర్షం నీరు వచ్చేస్తోంది, కానీ 'బేబీ' సినిమా కలెక్షన్స్ మాత్రం తగ్గటం లేదు. ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య , విరాజ్ అశ్విన్ లు నటించిన ఈ సినిమాకి సాయి రాజేష్ దర్శకత్వం వహించారు. అలాగే శ్రీనివాస్ ఈ సినిమాకి నిర్మాత. ఈ సినిమా విడుదలైన మొదటి రోజు నుండే సంచలనాలు సృష్టించే దిశగా పయనం అయింది. నిన్న ఈ సినిమా ఆనంద్ దేవరకొండ అన్న విజయ్ దేవరకొండ సినిమా 'అర్జున్ రెడ్డి'ని బ్రేక్ చేసింది. ఇప్పుడు ఈ చిన్న సినిమా ఇంకో పెద్ద సినిమా రికార్డు ని బ్రేక్ చేసింది. ప్రశాంత్ నీల్ దర్శకత్వం వహించిన 'కెజిఫ్ 2' సినిమా రికార్డు ఈ 'బేబీ' బ్రేక్ చేసింది. అది ఎలా అంటే, 'బేబీ' సినిమా వరసగా 13 రోజుల పాటు ఒక కోటి రూపాయల షేర్ ఆంధ్ర, తెలంగాణాలో కలెక్టు చేసింది. ఇది ఒక రికార్డు అని చెపుతున్నారు. ఇంతకు ముందు 'కెజిఫ్ 2' 12 రోజులకు వరసగా ఇలా ఒక కోటి రూపాయల షేర్ వసూల్ చేసింది, ఇప్పుడు 'బేబీ' ఆ రికార్డు ని అధిగమించి 13 రోజులపాటు ఆలా కలెక్టి చేసింది. అయితే ఈ రెండింటి కన్నా టాప్ లో వుండే సినిమా 'ఆర్ఆర్ఆర్' ఈ సినిమా వరసగా 17 రోజుల పాటు ఒక కోటి రూపాయల షేర్ వసూల్ చేసింది. ఇంత వర్షాలలోనూ 'బేబీ' సినిమాకి తగ్గని ఆదరణ చూస్తుంటే ఆ సినిమా ప్రభావం ఎంతలా ఉందొ అర్థం చేసుకోవచ్చు. ఇప్పుడు ఈ సినిమా రాజమౌళి సినిమా రికార్డు ను బ్రేక్ చేస్తుందా, లేక రెండో స్థానంలో ఉంటుందో ఈరోజు నుండి చూడాలి అని అంటున్నారు. అయితే 'ఆర్ఆర్ఆర్' రికార్డు బ్రేక్ చెయ్యడం సాధ్యం కాకపోవచ్చు, ఎందుకంటే రేపు పవన్ కళ్యాణ్, సాయి ధరమ్ తేజ్ నటించిన 'బ్రో' సినిమా విడుదలవుతోంది. ఈ సినిమా కోసం చాలా థియేటర్స్ తీసుకుంటారు, అందుకని 'బేబీ' సినిమా ఆడుతున్న థియేటర్స్ కూడా తగ్గించవచ్చు. అందుకని 'ఆర్ఆర్ఆర్' రికార్డు బ్రేక్ చెయ్యడం సాధ్యం కాకపోవచ్చు అని కూడా అంటున్నారు. ఏమైనా 'బేబీ' సినిమా బాక్స్ ఆఫీస్ దగ్గర వండర్స్ క్రియేట్ చేస్తోందనే చెప్పాలి.

## 'ఆహా'లో స్ట్రీమింగ్ అవుతున్న

# 'సామజవరగమన'




ఈ మధ్య కాలంలో ఫ్యామిలీ ఎంటర్టయినర్ జోనర్లో వచ్చిన సినిమాలలో 'సామజవరగమన' ఒకటి. శ్రీవిష్ణు – రెబా మోనికా జాన్ జంటగా నటించిన ఈ సినిమాను రాజేశ్ దండా నిర్మించగా .. రామ్ అబ్బరాజు దర్శకత్వం వహించారు. నరేశ్ .. వెన్నెల కిశోర్ ముఖ్యమైన పాత్రలను పోషించిన ఈ సినిమా, జూన్ 29వ తేదీన థియేటర్లకు వచ్చింది. 'ఆహా'లో రేపు స్ట్రీమింగ్ కావలసిన ఈ సినిమాను కాస్త ముందుకు జరిపి, ఈ రోజునే ట్రాక్ పైకి తెచ్చేశారు. హైదరాబాద్ – రాజమండ్రి మధ్య ఈ కథ నడుస్తుంది. ప్రేమ – పెళ్లి అనే అంశాల చుట్టూ తిరుగుతుంది. సినిమా మొదలైన దగ్గర నుంచి చివరి వరకూ బోర్ కొట్టకుండా నడుస్తుంది. గతంలో హీరోయిన్స్ వైపు నుంచి చూపించిన కోణాలను, ఈ సినిమాలో హీరో వైపు నుంచి చూపిస్తూ దర్శకుడు నాన్ స్టాప్ గా నవ్వించాడు. తాను ఇంకా యంగ్ అనుకునే పాత్రలో నరేశ్ ఫస్టాఫ్ లో నవ్విస్తే, కులపిచ్చి ఉన్న కులశేఖర్ పాత్రలో వెన్నెల కిశోర్ నవ్వులు పూయిస్తాడు. ప్రీ క్లైమాక్స్ నుంచి నవ్వుల శాతం మరింత పెరుగుతూ, మంచి ట్విస్ట్ తో ముగుస్తుంది. ఓటీటీ ఫ్లాట్ ఫామ్ నుంచి ఈ సినిమాకి మరింత రెస్పాన్స్ వచ్చే ఛాన్స్ ఉంది.

## సైలెంట్‌గా ఓటిటిలోకి

# చేరిన స్పై



నిఖిల్ సిద్దార్ధ నటించిన 'స్పై' సినిమా సైలెంట్‌గా ఓటిటికి చేరింది. జూన్ 29 న థియేటర్స్‌లో విడుదలైంది. అయితే ఈ సినిమా పాన్ ఇండియా సినిమాగా విడుదలైంది, అలాగే దీనితో నిఖిల్ ఎంతో ఆశించాడు కానీ, అయన ఆశలును ఈ సినిమా ఒక విధంగా నిరాశ పరిచిందనే చెప్పాలి. ప్రముఖ స్వతంత్ర వీరుడు సుభాష్ చంద్రబోస్ మరణం వెనక వున్న రహస్యం ఆధారంగా ఈ సినిమా కథా నేపథ్యం వుంది అని ఈ సినిమా నిర్వాహకులు మొదటి నుండీ చెపుతూనే వచ్చారు. అయితే ఈ సినిమాలో మాత్రం దానికి సంబంధించి ఎటువంటి కొత్త సమాచారం ఇవ్వలేదనే చెప్పాలి. ఈ సినిమాకి గ్యారీ బిహెచ్ దర్శకత్వం వహించాడు, ఇది అతనికి మొదటి సినిమా దర్శకుడిగా. రాజశేఖర్ దీనికి కథ, నిర్మాత కూడాను. ఇప్పుడు ఈ సినిమా ఓటిటి ఛానల్ అమెజాన్ ప్రైమ్ వీడియోలో ఈ సినిమాని మీరు వీక్షించవచ్చు. ఈరోజు నుండి ఈ సినిమా స్ట్రీమింగ్ అవుతోంది అని ఆ ఛానల్ అధికారికంగా తమ సాంఘీక మాధ్యమంలో ప్రకటించింది కూడా. ఈ సినిమాలో ఐశ్వర్య మీనన్కథానాయిక కాగా, ఇంకొక కథానాయికగా సాన్యా ఠాకూర్ చేసింది. ఆర్యన్ రాజేష్ ఇందులో ఒక చిన్న పాత్రలో కనపడతాడు. ఈ సినిమా హిందీ, తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం భాషల్లో చూసుకోవచ్చు అని కూడా ఆ ఓటిటి ఛానల్ తెలియచేసింది. ఇందులో రా సంస్థకి చెందిన జైవర్ధన్ స్పై గా నిఖిల్ కనపడతారు, అతనికి సహాయకులుగా అభినవ్ గోమాటం , అలాగే ఐశ్వర్య మీనన్, సాన్యా ఠాకూర్ లు కూడా ఇందులో స్పై లుగా కనపడతారు. నిఖిల్ అన్నయ్య ఆర్యన్ రాజేష్ కూడా రా లో పనిచేస్తూ చనిపోతే, తన అన్నయ్యని ఎవరి చంపింది తెలుసుకోవటానికి ప్రయత్నం చేస్తూ ఉంటాడు.

# భారీ వర్షాలతో స్థంబించిన జనజీవనం



- భారీ వర్షంతో సీజనల్ వ్యాధులు ప్రభలే ప్రమాధం
- పలు కాలనీలన్ని నీటిలోనే - వారం రోజులుగా రాష్ట్రంలో కుండపోత వర్షాలు
- నగరంమంతా జలమయం - ఎక్కడికక్కడ నిలచిపోయిన ట్రాఫిక్

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** భారీ వర్షాల వల్ల రాష్ట్ర మంతా తడిసి ముద్దై పోయి జన జీవితం అస్తవ్యస్తంగా మారింది. భారీ వర్షాల కారణంగా గత వారం రోజులుగా ఇండ్లకే పరిమితమైన ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుచున్నారు. వాతావరణ శాఖ హెచ్చరించినట్లుగానే రాష్ట్ర మంతా భారీ వర్షాలు కురుస్తున్నాయి. హైదరాబాద్ మహనగరంలో చిరుజల్లులుగా ప్రారంభమైన వర్షం ఒక్కసారిగా కుండపోత వర్షం మారింది. ఆకాశానికి రంధ్రం పడిందా లేక మేఘం విరిగి పడిందా అన్నంతగా ఏకదాటిగా వర్షం కురుస్తోంది. భారీ వర్షం కారణంగా రోడ్లన్నీ జలమయమై చెరువులుగా మారి ఎక్కడికక్కడ ట్రాఫిక్ నిలిచిపోయింది. దీనికి తోడు చల్లని ఈదురు గాలులు, ఉరుములు మెరుపులతో కుండపోతగా కురుస్తున్న భారీ వర్షంలతో జనాలుసీజనల్ వ్యాధులకు గురై తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోంటున్నారు. ఇక ఉద్యోగాలకు వెళ్ళే వాహణదారులు చెరువులను తలపిస్తున్న రోడ్లపై ప్రయాణిస్తు ఎక్కడి కక్కడ ట్రాఫిక్ జాంలలో చిక్కుకుని పైన వాన కింద వరద నీటితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదిలా ఉంటే ఈదురు గాలుల ధాటికి పలు చోట్ల చెట్ల కొమ్మలు, విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయి అందకారం అలుముకుంది. వర్షాలు ఏ మాత్రం తగ్గక పోను గంట గంటకు ఎక్కువవుతుండడంతో తీవ్ర స్థాయిలో వర్షపాతం నమోదవుతు లోతట్టు ప్రాంతాలన్ని జలమయమై జనజీవనం స్తంభించిపోయి రాష్ట్ర మంతా అతలాకుతలంగా మారిపోయింది. ఇక నగరంలోని కూకట్‌పల్లి, కే.పీ.ఎచ్.బి గచ్చిబౌలి, మియాపూర్, శేరిలింగంపల్లి, చందానగర్, మాదాపూర్, కుత్బుల్లాపూర్, జీడిమెట్ల, బంజారాహిల్స్, ఫిల్మ్‌నగర్, నాంపల్లి, కొఠీ,చాదర్ ఘాట్, దిల్ సుఖ్ నగర్, ఎల్ బి నగర్, హయత్ నగర్ మలక్ పేట్ సంతోష్ నగర్ భడంగ్ పేట్ బాలాపూర్ తో పాటు పలు ప్రాంతాల్లో కుండపోతగా వర్షం కురుస్తుంది. మూసాపేట్, బోరబండ, ఎర్రగడ్డ, సనత్‌నగర్ ప్రాంతాల్లో భారీ వర్షం కురుస్తోంది. ఈ నేపథ్యంలో జీ.హెచ్,ఎం.సీ ఆరెంజ్ అలర్ట్ ప్రకటించగా బల్దియా అధికారులు అప్రమత్తంగా ఉండాలని మేయర్ విజయలక్ష్మి ఆదేశించారు.

అలాగే భారీవర్షాలు కురుస్తున్న నేపద్యంలో భడంగ్ పేట్ మున్సిపల్ కార్పోరేషన్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండి ప్రజలకు అందుబాటులో ఉండాలని మేయర్ పారిజాత నర్సింహరెడ్డి ఆదేశించారు.అయితే నగరంలో భారీ వర్షాలు కురిసే అవకాశముందని ఇప్పటికే హైదరాబాద్ వాతావరణ శాఖ హెచ్చరించింది.దీంతో కుండపోతగా కురుస్తున్న భారీ వర్షాలు ఇప్పట్లో తగ్గే సూచనలు కనిపిస్తలేవని, ప్రజలు మరింత జాగ్రత్తలు పాటించాలని, చల్లటి ఈదురు గాలులు వీస్తుండడం వల్ల అనారోగ్య సమస్యలు తల్లెత్తుతాయని, దీంతో తగు జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచిస్తున్నారు.

# శ్రీశైలం దేవస్థానం ఆర్జిత సేవలు ప్రత్యేక యాప్

- మంత్రి కొట్టు సత్యనారాయణ ప్రారంభించారు



శ్రీశైలం (ప్రశ్న న్యూస్ )శ్రీశైలం మల్లన్న భక్తులు ఆన్లైన్ లో స్పర్శదర్శనం,ఆర్జితసేవ టిక్కెట్లను పొందేందుకు మంత్రి కొట్టు సత్యనారాయణ ప్రత్యేక యాప్ ను ప్రారంభించారు అలానే నందిగుడి వద్ద టూరిస్ట్ ఫెసిలిటేషన్ సెంటర్ లో దేవస్థాన ప్రచురణల విక్రయ కేంద్ర%శీ% నంది సర్కిల్ వద్ద భక్తుల సౌకర్యార్థం సెంట్రల్ రిసెప్షన్ కౌంటర్ ని మంత్రి కొట్టు సత్యనారాయణ ప్రారంభించారు అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ ఘాటు వ్యాఖ్యలు చేశారు ఏపీ రాజధాని తరలింపు ఈసంవత్సరంలో ఉంటుందన్నారు తెలంగాణలో కడియం శ్రీహరి,రాజయ్య సీటు కోసం కొట్లాడుతూ కెసిఆర్ కు దగ్గర కావొచ్చని నేపథ్యంలో ఏపీ అభివృద్ధిపై శ్రీహరి మాట్లాడారని అలానే ఏపీ బీజేపీ అధ్యక్షురాలుగా పురందేశ్వరి బాద్యతలతో ప్రస్తుతం వాళ్లలో వాళ్లే ముఠా తగాదాలతో కొట్టుకుంటున్నారని ఎద్దేవా చేశారు ప్రస్తుతం బీజేపీలో సోము వీర్రాజు మనుషులను తీసివేసి టిడిపి కోవర్టులకు కీలక పదవులు ఇస్తున్నట్లు వార్తలు కూడా వస్తున్నాయని అన్నారు అలానే రాష్ట్రానికి రాయలసీమకు ద్రోహి చంద్రబాబే అని ఆయనకి ఒకరిని విమర్శించే అర్హత లేదని కుప్పం నుండి వరుసగా చంద్రబాబు 6సార్లు గెలిచిన అక్కడ ఒక ఆర్టీవో ఆఫీస్ గాని మున్సిపాలిటీ లేదన్నారు చంద్రబాబు సొంత ఊరిలో ప్రైమరీ స్కూల్ ను కూడా బాగు చేయని ద్రోహి అన్నారు పవన్ పై మాట్లాడుతూ మణిపూర్ అల్లర్లు గొడవలు జరుగుతున్నాయని వాటిపై పవన్ దృష్టి పెట్టి కేంద్రానికి సలహాలు ఇవ్వమనండి అలానే ఏపీలో మహిళలు మిస్ అవుతున్నారని పవన్ ఆరోపణ చేశారు ఆధారాలు పవన్ దగ్గర ఉంటే ఇవ్వమనండి స్పందిస్తామన్నారు అలానే మా ప్రభుత్వం పోయినసారి 86% ఓట్లు వచ్చాయి ఈసారి 100% తో ఎక్కువ స్థానాలు గెలుస్తామని మంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు.

# మేడారం గ్రామములో ముంపు గురైన ప్రాంతాన్ని పరిశీలించి ఎమ్మెల్యే సీతక్క





- బాధిత కుటుంబాలను పరామర్శించి వారికి దైర్యం చెప్పిన సీతక్క
- పసర, తాడ్వాయి మధ్య ఉన్న జలగలంచ వాగును పరిశీలన



తాడ్వాయి(ప్రశ్న న్యూస్ ) తాడ్వాయి మండలం లోని మేడారం గ్రామములో భారీ వర్షాల మూలాన గ్రామం మొత్తం జలమయం కాగా ముంపు గురైన ప్రాంతాన్ని పరిశీలించి బాధిత కుటుంబాలను పరామర్శించిన ములుగు ఎమ్మెల్యే సీతక్కఈ సందర్భంగా మాట్లాడుతూ బాధిత కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని సీతక్క ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జలగలంచ వాగును పరిశీలించారు. గత 2 రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా వాగు ఉధృతంగా ప్రవహించడం తో 163 జాతీయ రహదారి తెగిపోయి రాకపోకలు స్తంభించడం తో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు అధికారులు వెంటనే మరమ్మతులు చేపట్టాలి అని సీతక్క అన్నారుఈ కార్యక్రమంలో మండల ఇంఛార్జి జాలాపు అనంత రెడ్డి మండల అధ్యక్షులు బోల్లు దేవేందర్.జిల్లా నాయకులు లచ్చు పటేల్,సర్పంచ్ ఇర్ప సునీల్,గ్రామ కమిటీ అధ్యక్షులు పాక రాజేందర్ తదితరులు పాల్గొనడం జరిగింది.

# భారీ వర్షాల వల్ల ఇబ్బందులు ఎదుర్కోంటున్న ప్రజలకు అండగా ఉండండి

- పార్టీ శ్రేణులకు వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ పిలుపు



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల వలన ప్రభావితమైన ప్రజలకు అండగా నిలవాలని పార్టీ ప్రజా ప్రతినిధులకు, పార్టీ శ్రేణులకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ పిలుపునిచ్చారు. గత వారం రోజులుగా భారీగా, ఆగకుండా కురుస్తున్న వర్షాల వలన కొన్ని జిల్లాల్లో వరద ప్రభావం అధికంగా ఉన్న నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో పార్టీ శ్రేణులు ప్రజలకు తోడుగా నిలవాలని కేటీఆర్ పార్టీ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు.

ముఖ్యంగా వరంగల్ లాంటి జిల్లాలో నీట మునిగిన ప్రాంతాలు, గ్రామాలలో సహాయక కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున పాల్గొనాలన్నారు. స్థానికంగా పార్టీ శ్రేణులు ప్రజలకు అవసరమైన నిత్యవసర సరుకులు అందించడం నుంచి మొదలుకొని తమకు తోచిన ఇతర మార్గాల్లోనూ సహాయం చేయాలన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో ప్రభుత్వం, ప్రభుత్వ యంత్రాంగం పూర్తి నిబద్ధతతో కృషి చేస్తున్నదని ఈ నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగానికి అధికారులకు బాధ్యత కలిగిన పార్టీగా అండగ నిలవాల్సిన అవసరం ఉందని మంత్రి కేటీఆర్ అన్నారు.

# తెలంగాణ చరిత్రలోనే రికార్డు స్థాయి వర్షపాతం

- ములుగు జిల్లాలోని లక్ష్మీదేవిపేటలో 649.8 మి.మీ వర్షపాతం
- 2013లో వాజేడులో 517.5 మి.మీ వర్షపాతం



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో కొద్దిరోజులుగా వర్షాలు దంచికొడుతూనే ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ వానలు విస్తరంగా వానలు పడుతున్నాయి. వారం రోజులుగా అసలు వర్షాలు ఆగడం లేదు. దీంతో ముసురు వానతో ప్రజలు పనుల కోసం బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. పలుచోట్ల వాగులు నిండిపోవడంతో ప్రయాణాలు నిలిచిపోయాయి. భారీ వర్షాలు మరో 48 గంటలు కొనసాగే అవకాశముందని, ప్రజలు బయటకు వెళ్లకపోవడం మంచిదని అధికారులు సూచిస్తున్నారు. అయితే తెలంగాణ చరిత్రలోనే అత్యంత భారీ వర్షంపాతం ములుగు జిల్లాలో నమోదైంది. గడచిన 24 గంటల్లో ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని లక్ష్మీదేవిపేటలో ఏకంగా 649.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు వాతావరణశాఖ స్పష్టం చేసింది. దీనిని ఇప్పటివరకు రికార్డు స్థాయి వర్షపాతంగా వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు. ములుగు జిల్లాలోని వాజేడులో 2013 జులై 19న 517.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఆ తర్వాత ఇప్పుడు మళ్లీ రికార్డు వర్షపాతం ములుగు జిల్లాలో రికార్డు అయింది. గత 24 గంటల్లో రాష్ట్రంలోని 35 ప్రాంతాల్లో 20 సెంటీమీటర్లపైన వర్షపాతం నమోదైంది. 200ల కేంద్రాల్లో 10 సెంటిమీటర్లకుపైగా నమోదైంది. ఇక రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. తూర్పు, మధ్య తెలంగాణవ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా వానలు పడుతున్నాయి. హైదరాబాద్‌లో ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం పడుతోంది. గత 6 గంటల్లో 60 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవ్వగా.. తదుపరి కొన్ని గంటల్లో 30–40 మిల్లీమీటర్ల వరకు నమోదయ్యే అవకాశముందని వాతావరణశాఖ అంచనా వేసింది. ఈ నెలలో రాష్ట్రంలో గరిష్ట స్థాయి వర్షపాతం నమోదవ్వగా వచ్చే నెలలో కూడా సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో కూడా అత్యధిక వర్షపాతం నమోదు కానుందని వాతావరణశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

# ఎమ్మెల్యే ఇంటి వెనకాలే మురికి నీరు

- సమస్యను పరిష్కరించుకో లేని ఎమ్మెల్యే భేతి సుభాష్ రెడ్డి
- నియోజకవర్గ ప్రజల సమస్యలను తీరుస్తాడా : రాగిడి లక్ష్మారెడ్డి



**కాప్రా (ప్రశ్న న్యూస్)** ఉప్పల్ నియోజకవర్గం హబ్సిగూడ డివిజన్ రవీంద్ర నగర్ లో పర్యటించిన ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాగిడి లక్ష్మారెడ్డి, రవీంద్ర నగర్ సెయింట్ జోసెఫ్ స్కూల్ పక్కనపొంగిపొర్లుతున్న డ్రైనేజీ, తెరుచుకున్న మాన్ హొల్ కాలనీల గుండా వర్షం నీరు ప్రవహిస్తున్న పట్టించుకోని అధికారులు మరియు సాక్షాత్తు స్థానిక ఎమ్మెల్యే ఇంటి వెనకాలనే ఇలాంటి దుస్థితి ఉంటే పట్టించుకోని ఎమ్మెల్యే మరి నియోజకవర్గంలో పరిస్థితి ఏమిటి అని రాగిడి లక్ష్మారెడ్డి ఎద్దేవా చేశారు,సెయింట్ జోసెఫ్ పాఠశాల పక్కన నిత్యం వందలాది విద్యార్థులు రాకపోకలు సాగిస్తున్న రహదారిలో ఈ మురికి నీరుప్రవహి స్తుండడంతో విద్యార్థులకు డెంగ్యూ మలేరియా లాంటి విష జ్వరాలు వచ్చే అవకాశాలు ఉన్నా పట్టించుకోని స్థానిక ఎమ్మెల్యే, మున్సిపల్ అధికారులు, వెంటనే డ్రైనేజీ వ్యవస్థని మెరుగుపరచాలని రాగిడి లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలోటిపిసిసి మైనారిటీస్ జనరల్ సెక్రెటరీ సంజయ్ జైన్, టిపిసిసి సభ్యులు వినోద్ ముదిరాజ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు శ్రీనివాస్ యాదవ్, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఎస్టీ సెల్ చైర్మన్ గణేష్ నాయక్, పలకల నరసింహారెడ్డి, రాజు నాయక్, భాను గౌడ్, మురళి ముదిరాజ్, సల్మాన్ బాబు, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా యువజన కాంగ్రెస్ సెక్రెటరీ సాయిబాబా, చందు యాదవ్, మల్లేష్ యాదవ్, పుల్లారెడ్డి, ఉప్పల్ నియోజకవర్గం బి బ్లాక్ మైనారిటీస్ వైస్ చైర్మన్ జరుద్దీన్, ఉప్పల్ డివిజన్ మైనారిటీస్ చైర్మన్ గజ్జల రాజు, వినయ్, గొల్లూరి ప్రభాకర్, శ్రవణ్ కుమార్, కిరణ్, వెంకటేష్, నాగ, నవీన్, అశోక్, సాదిక్, సతీష్ గౌడ్, పవన్, అజయ్, తదితరులు పాల్గొన్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588